# ప్రజా తపన

prajathapana.com

*News that matters*





జ్ఞాన సముపార్జనకు ప్రశాంతమైన మనస్సే ప్రధానమైనది.

స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 2 మంగళవారం 07 ఫిబ్రవరి 2023 ఎం. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# సంస్కరణలతో ఆకాంక్షాత్మక సమాజం ఆవిష్కరణ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ బెంగళూరులో భారత ఇంధన వారోత్సవాలు-2023 (ఇండియా ఎనర్జీ వీక్)కు శ్రీకారం చుట్టారు. అలాగే ఇండియన్ ఆయిల్ లిమిటెడ్ (ఐఓఎల్) 'అన్ బాటిల్డ్' కార్యక్రమం కింద యూనిఫారాలను ప్రారంభించారు. వీటిని రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ సీసాలతో తయారుచేశారు. దీంతోపాటు 'ఐఓఎల్ రూపొందించిన ఇన్‌డోర్ సౌరశక్తి వంట వ్యవస్థ జంట స్టవ్‌లను జాతికి అంకితం చేయడంతోపాటు మార్కెట్ లోకి విడుదల చేశారు.

అనంతరం ఇథనాల్ మిశ్రమ మార్గ ప్రణాళికకు అనుగుణంగా 11 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని చమురు విక్రయ కంపెనీలకు చెందిన 84 చిల్లర విక్రయ కేంద్రాల్లో 'ఇ20' ఇంధన విక్రయాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. మరోవైపు హరిత రవాణా ప్రదర్శనకు కూడా ప్రధానమంత్రి జెండా ఊపి శ్రీకారం చుట్టారు. హరిత ఇంధనాలపై ప్రజల్లో అవగాహన పెంపు దిశగా చేపట్టిన ఈ ర్యాలీలో హరిత ఇంధనంతో నడిచే వాహనాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ముందుగా భూకంపం వల్ల టర్కీ, పరిసర దేశాలలో సంభవించిన విధ్వంసం, ప్రాణనష్టంపై సంతాపం తెలిపారు. భారత్ తరఫున సాధ్యమైన మేర సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. బెంగళూరు నగరం సాంకేతికత, ప్రతిభ, ఆవిష్కరణలకు నిలయమని ఆయన కొనియాడారు. ఇక్కడున్న ప్రతి ఒక్కరికీ నిత్యం ఈ అనిర్వచనీయ శక్తి అనుభవంలో ఉన్నదేనని ప్రధాని వ్యాఖ్యానించారు. 'ఇండియా ఎనర్జీ వీక్' అనేది జి-20 కేలండరులో తొలి కీలక ఇంధన కార్యక్రమం అని, దీనికి ప్రతి ఒక్కరినీ స్వాగతిస్తున్నానని ఆయన తెలిపారు.

ప్రపంచానికి 21వ శతాబ్దపు భవిష్యత్తు దిశను నిర్దేశించడంలో ఇంధన రంగానికిగల కీలక పాత్ర గురించి ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. "ఇంధన పరివర్తన, సరికొత్త ఇంధన వనరుల అభివృద్ధి కోసం ప్రపంచంలో బలంగా గళం వినిపిస్తున్న భారతదేశం ఒకటి. ఆ మేరకు వికసిత భారతం సంకల్పంతో ముందుకెళ్తున్న మనదేశ ఇంధన రంగంలో అవకాశాలు అపారం" అని ప్రధాని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా పురోగమిస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ ఒకటని పేర్కొంటూ 'ఐఎంఎఫ్' ఇటీవల ప్రకటించిన అంచనాలను ప్రస్తావించారు. ప్రపంచం నేడు మహమ్మారి, యుద్ధం నడుమ చిక్కుకున్న నేపథ్యంలో భారతదేశం ఉజ్వల తారగా ప్రకాశిస్తున్నదని ప్రధాని అభివర్ణించారు. బాహ్యకారకాలతో నిమిత్తం లేకుండా ఎలాంటి అవరోధాన్నయినా అధిగమించగల సామర్థ్యాన్ని భారత ప్రతిరోధకత మనకు కల్పించిందని గుర్తుచేశారు.

ఈ మేరకు ప్రధానమంత్రి అనేక అంశాలను ఉదాహరించారు- మొదటిది నిలకడైన నిర్ణయాత్మక ప్రభుత్వం కాగా, రెండోది సుస్థిర సంస్కరణలని, మూడోది%ా% క్షేత్రస్థాయిలో సామాజిక-ఆర్థిక సాధికారతేనని స్పష్టం చేశారు. దీంతోపాటు బ్యాంకు ఖాతాల ద్వారా ఆర్థిక సార్వజనీనత, ఉచిత ఆరోగ్య సౌకర్యాలు, సురక్షిత పారిశుధ్యం, విద్యుత్తు, గృహనిర్మాణం, కొళాయిల ద్వారా కోట్లాది కుటుంబాలకు మంచినీరు వంటి బృహత్తర, సామాజిక మౌలిక సౌకర్యాలు పలు ప్రధాన దేశాల జనాభాకన్నా ఎక్కువమంది ప్రజలకు చేరువయ్యాయని తెలిపారు.

దేశంలో పేదరికం నుంచి మధ్యతరగతి స్థాయికి చేరుకున్న కోట్లాది ప్రజల



(మిగతా 2లో)




## టర్కీసిరియా దేశాలను కుదిపేసిన భూ ప్రకంపనలు

**ఇస్తాంబుల్ :**

7.8 తీవ్రతతో వచ్చిన భారీ భూకంపం టర్కీసిరియా దేశాలను కుదిపేసింది. సైప్రస్లెబనాన్ లోనూ భూ ప్రకంపనలు సంభవించాయి. ఇప్పటివరకూ 7 వందల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది గాయపడ్డారు. వందలాది భవనాలు, ఇళ్లు నేలమట్టమయ్యాయి. తెల్లవారుజామున 4 గంటల 17 నిమిషాలకు భూకంపం వచ్చాక ఇప్పటివరకూ మొత్తం 40 సార్లు భూమి కంపించింది. దక్షిణ టర్కీలోని గజియాన్‌టెప్ సమీపంలో నరుద్గీకి 23 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూజి జియాలాజికల్ సర్వే తెలిపింది. భూకంప తీవ్రతకు పలు ప్రాంతాల్లో భవనాలు, అపార్ట్‌మెంట్లు కూలిపోయాయని, భారీ ఆస్తినష్టం జరిగింది. ప్రజలు హాహాకారాలు చేస్తూ రోడ్లపైకి పరుగులు తీశారు. భారీ భూకంపం తర్వాత హైఅలర్ట్ ప్రకటించినట్టు టర్కీ అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది. సిప్రస్, టర్కీ, గ్రీస్, జోర్డాన్, లెబనాన్, సిరియా, యూకే, ఐరాక్, జార్జియాలోనూ ప్రకంపనలు సంభవించాయి. సిరియాలోని అలెప్పో,



సెంట్రల్ సిటీ హమాలో కొన్ని భవనాలు కుప్పకూలినట్లు సిరియా ప్రభుత్వ మీడియా పేర్కొంది. బీరూట్, డమాస్కస్‌లలో అపార్ట్‌మెంట్లు, భవనాలు కంపించడంతో స్థానిక ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. టర్కీ లోని 10 నగరాలపై భూకంప ప్రభావం ఉన్నట్టు టర్కీ దేశీయాంగ మంత్రి సులేమాన్ సోయిల్ తెలిపారు. గజియాన్‌టెప్, కహ్రమాన్‌మరస్, హటాయ్, ఒస్మానియె, అడియమన్, మలట్య, అదన, కిలిస్ తదితర నగరాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. టర్కీ, సిరియా ఆసుపత్రుల్లో ఎటు చూసినా భూకంప బాధితులే కనపడుతున్నారు. గాయపడ్డవారిలో చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. మరణాల సంఖ్య క్షణక్షణానికీ పెరుగుతోంది. ఆసుపత్రులు మరుభూములను తలపిస్తున్నాయి.

## హెలికాప్టర్ ఫ్యాక్టరీని జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

**తుముకూరు:**

తుమకూరులో దేశంలోనే అతిపెద్ద హెలికాప్టర్ ఇండస్ట్రీని భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తుమకూరు జిల్లా, గుబ్బి తాలూకాలోని కావల్ దగ్గర భారత దేశంలోనే అతిపెద్ద హెలికాప్టర్ తయారు చేసే కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కర్మాగారం ఏషియాలోనే అతిపెద్దది. హెచ్ ఏ ఎల్ లోని బృహత్ హెలికాప్టర్ తయారు కేంద్రాన్ని ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఎల్. సి. హెచ్, స్థానిక టెక్నాలజీ తో అభివృద్ధి చేసిన 3- టన్ వర్గానికి చెందిన ఒకే ఇంజన్ తో కూడిన వివిధ ఉద్దేశాలకు ఉపయోగించే లాగా ఈ హెలికాప్టర్ ను తయారు చేస్తారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, ముఖ్యమంత్రి ఎస్. ఆర్. బొమ్మయ్ ,రాష్ట్ర హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర పాల్గొన్నారు. భవిష్యత్తులో సివిల్ ఎల్.యు.హెచ్. లను ఎగుమతి చేసే సామర్థ్యం కలిగిన ఈ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకమైనది.







# సంస్కరణలతో ఆకాంక్షాత్మక సమాజం ఆవిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

జీవన నాణ్యతలో వచ్చిన సానుకూల మార్పులను ప్రధానమంత్రి గుర్తుచేశారు. దేశంలో 6,00,000 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ లైన్ ఏర్పాటు చేశామని, తద్వారా ప్రతి గ్రామానికీ ఇంటర్నెట్ సదుపాయం ఉందని ఆయన తెలిపారు. గత 9 సంవత్సరాల్లో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశంలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 13 రెట్లు పెరిగిందన్నారు. అలాగే ఇంటర్నెట్ కనెక్షన్లు కూడా మూడు రెట్లు పెరిగాయని ప్రధానమంత్రి తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ వాడకందారుల సంఖ్య వేగంగా పెరుగుతోందన్నారు. అంతర్జాతీయంగా మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ 2వ అతిపెద్ద దేశంగా అవతరించిందని ప్రధాని వెల్లడించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆకాంక్షాత్మక తరగతిగా ఏర్పడటానికి దారితీసిందని ప్రధాన మంత్రి తెలియజేశారు. "భారత ప్రజలు మెరుగైన ఉత్పత్తులు, మెరుగైన సేవలు, మరింత మెరుగైన మౌలిక సదుపాయాలను ఆకాంక్షిస్తున్నారు" అని పేర్కొన్నారు. భారత పౌరుల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఇంధనానికిగల కీలక పాత్రను ఎత్తి చూపుతూ ప్రధాని ప్రసంగం కొనసాగించారు.

సమీప భవిష్యత్తులో భారతదేశంలో ఇంధన ఆవశ్యకతను, పెరిగే డిమాండ్‌ను నొక్కిచెప్పిన ప్రధానమంత్రి- అభివృద్ధి శరవేగం అందుకుంటున్నందున కొత్త నగరాలు ఆవిర్భవిస్తాయని తెలిపారు. అంతర్జాతీయ ఇంధన సంస్థను ఉటంకిస్తూ- ప్రస్తుత దశాబ్దంలో భారత ఇంధన డిమాండ్లు అత్యధికంగా ఉంటాయని, తద్వారా ఈ రంగంలోని పెట్టుబడిదారులకు, భాగస్వాములకు అపార అవకాశాలు కలిసివస్తాయని ప్రధాని వ్యాఖ్యానించారు. ప్రపంచ చమురు డిమాండ్‌లో భారత్ వాటా 5 శాతం కాగా, 11 శాతానికి వరకు పెరుగుతుందని అంచనాలున్నట్లు పేర్కొన్నారు. అలాగే భారత గ్యాస్ డిమాండ్ కూడా 500 శాతందాకా పెరుగుతుందని అంచనా. ఈ విధంగా దేశంలో ఇంధన రంగం విస్తరణతో పెట్టుబడులు, సహకారం దిశగా సరికొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయని ఆయన నొక్కిచెప్పారు.

భారత ఇంధన రంగం సంబంధిత వ్యూహంలో నాలుగు అంచెల గురించి ప్రధానమంత్రి వివరించారు. మొదటిది%ూ% దేశీయ అన్వేషణ-ఉత్పత్తిని పెంపు, రెండోది%ూ% సరఫరా వైవిధ్యీకరణ, మూడోది%ూ% జీవ ఇంధనం-ఇథనాల్, కంప్రెస్డ్ బయోగ్యాస్, సౌరశక్తి వంటి ఇంధనాల విస్తరణ. నాలుగోది%ూ% ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ద్వారా కర్బనవిముక్తి. ఈ నేపథ్యంలో చమురుశుద్ధి సామర్థ్యం రీత్యా భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద దేశమన్నారు. ప్రస్తుత వార్షిక సామర్థ్యం 250 మిలియన్ మెట్రిక్ టన్నులు (ఎంఎంటిపిఎ) కాగా, దీన్ని 450 'ఎంఎంటిపిఎ'కి పెంచే కృషి సాగుతోందన్నారు. ఈ మేరకు "మన శుద్ధి సామర్థ్యాన్ని నిరంతరం ఆధునికంగా, ఉన్నతంగా, దేశీయంగా మార్చుకుంటున్నాం" అని ఆయన చెప్పారు. అలాగే పెట్రో-రసాయనాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి భారత్ కృషి చేస్తోందన్నారు. ఇంధన రంగం తన సామర్థ్యాన్ని విస్తృతం చేసుకునేందుకు భారతదేశ సాంకేతికతను, అంకుర పర్యావరణ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని అగ్రశ్రేణి సంస్థలను ఆయన కోరారు.

దేశంలో ఇంధన మిశ్రమంరీత్యా 2030 నాటికి అందులో సహజ వాయు వినియోగాన్ని 6 నుంచి 15శాతానికి పెంచే దిశగా ప్రభుత్వం ఉద్యమ తరహాలో కృషి చేస్తోందని, ఇందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల 'ఒన్ నేషన్-ఒన్ గ్రిడ్' కింద అందజేస్తామని ప్రధానమంత్రి తెలిపారు. "ఎల్ఎన్‌జి టెర్మినల్ రీగ్యాసిఫికేషన్ సామర్థ్యం పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోంది" అని ప్రధాని చెప్పారు. ఈ మేరకు 2022లో టెర్మినల్ రీగ్యాసిఫికేషన్ సామర్థ్యం 21 'ఎంఎంటిపిఎ' స్థాయికి చేరి రెట్టింపైందని, మరింత పెంచే ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. దేశంలో 'సిజిడి'ల సంఖ్య 9 రెట్లు పెరిగిందని, ఈ మేరకు 2014లో 900 కాగా, నేడు 'సిఎన్‌జి' స్టేషన్ల సంఖ్య 5000కు చేరిందని ఆయన అన్నారు. గ్యాస్ పైప్‌లైన్ నెట్‌వర్క్ కూడా 2014 నుంచి ఇప్పటిదాకా 14,000 స్థాయి నుంచి 22,000 కిలోమీటర్లకు పెరగడాన్ని ప్రధాని ఉటంకించారు. నాలుగైదేళ్లలో 35,000 కిలోమీటర్లకు విస్తరించగలదని ధీమాగా చెప్పారు.

దేశీయంగా చమురు అన్వేషణ-ఉత్పత్తికి సంబంధించి భారత్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ- ఈ రంగం ఇప్పటిదాకా అందుబాటులో లేని ప్రాంతాలపైనా ఆసక్తి చూపుతున్నదని ప్రధాని తెలిపారు. ఈ మేరకు "మేము ప్రవేశ నిషిద్ధ (నో-గో) ప్రాంతాలను తగ్గించాం. దీంతో 10 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం 'నో-గో' నిబంధన నుంచి విముక్తమైంది. ఈ అవకాశాలన్నిటినీ సద్వినియోగం చేసుకోవాలని, శిలాజ ఇంధన అన్వేషణలో మీ ఉనికిని చాటుకోవాలని పెట్టుబడిదారులందరినీ కోరుతున్నాను" అని ఆయన చెప్పారు.

జీవ ఇంధన విస్తరణకు సంబంధించి, ప్రధానమంత్రి గత ఏడాది ఆగస్టులో తొలి 2జి ఇథనాల్ బయో-రిఫైనరీ గురించి ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో 12 వాణిజ్య 2జి ఇథనాల్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే స్థిరమైన విమాన ఇంధనం, వాణిజ్యపరంగా పునరుత్పాదక డీజిల్ సాధ్యాసాధ్యాలపై ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులను ప్రస్తావిస్తూ- 500 కొత్త 'వర్థ్యం నుంచి అర్థం' గోబర్ధన్ ప్లాంట్లు, 200 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు, 300 సామాజికాధారిత ప్లాంట్లు వంటివి పెట్టుబడులకు కొత్త బాటలు వేస్తాయని తెలిపారు. మరోవైపు "జాతీయ హరిత ఉదజని కార్యక్రమం 21వ శతాబ్దపు భారతదేశానికి కొత్త దిశను నిర్దేశిస్తుంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ దశాబ్దం చివరికల్లా 5 'ఎంఎంటిపిఎ' గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు. తద్వారా రూ.8 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని నొక్కి చెప్పారు. అలాగే 'గ్రే హైడ్రోజన్' స్థానంలో భారత్ తన గ్రీన్ హైడ్రోజన్ వాటాను 25 శాతానికి పెంచుతుందని ఆయన ప్రకటించారు.

# భారత్ అభివృద్ధిని కాంగ్రెస్ చూడలేకపోతోంది

**న్యూఢిల్లీ :**

పార్లమెంట్ ఉభయ సభల్లో కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరును తప్పుపట్టారు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి. అదానీ హిండెన్‌బర్గ్ వ్యవహారంపై చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు ఉభయ సభలను అడ్డుకోవం సరిగ్గాలేదని హితవు పలికారు. కాంగ్రెస్‌కు ప్రజానుకూల చట్టాలతో సంబంధం లేదని అన్నారు. కాంగ్రెస్ లేవనెత్తుతున్న సమస్యలను ఆర్థిక మంత్రి పదేపదే మాట్లాడుతున్నారు. నేడు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అభివృద్ధిని ప్రపంచ దేశాలు గుర్తించాయన్నారు. కాంగ్రెస్ దీనిని జీర్ణించుకోలేక చిల్లర రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తోందని జోషి కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారు. పార్లమెంట్ వ్యవహారాలపై కాంగ్రెస్ కనీసం ఆసక్తి చూపలేదని.. ప్రజానుకూల చట్టాలను తీసుకురావడం గురించి వారు పట్టించుకోవడం లేదన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్ చారిత్రాత్మక ఉత్పాదకతను వారు అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు ప్రహ్లాద్ జోషి. గత తొమ్మిదేళ్లలో కాంగ్రెస్ అన్ని పార్లమెంటరీ సంప్రదాయాలను అగౌరవపరిచిందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విమర్శించారు. వారి నాయకులు పార్లమెంటుకు హాజరు కాకుండా విదేశాలలో సెలవులను ఇష్టపడుతున్నారని.. గౌరవ నీయులైన రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించిన చేసిన ప్రసంగానికి దూరంగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం చూస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీరు రాష్ట్రపతిని అవమానించినట్లే అని అన్నారు. అభివృద్ధి ఆధారిత బడ్జెట్‌కు ప్రభుత్వం ప్రశంసలు అందించాల్సి వస్తుందనే భయంతో పార్లమెంటును నడపడానికి కాంగ్రెస్ దూరంగా ఉందన్నారు. ఇదే అంశంపై వంతుగా మూడు తాజా పోస్టులను చేసింది కాంగ్రెస్ పార్టీ. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేష్ మాట్లాడుతూ, "ప్రధానమంత్రికి అనుసంధానించబడిన అదానీ మహామెగా స్కామ్‌లో జేపీసీకి తమ న్యాయబద్ధమైన డిమాండ్‌ను పార్లమెంటులో ప్రస్తావించడానికి కూడా ప్రతిపక్షాలు వరుసగా మూడవ రోజు కూడా అనుమతించలేదు. మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. మోదీ ప్రభుత్వం పారిపోతోందంటూ విమర్శించారు. అదానీ గ్రూప్‌పై హిండెన్ బర్గ్ రిపోర్ట్ ప్రకంపనలు సృష్టిస్తోంది. 15రోజులుగా దుమారం చెలరేగుతోంది. పార్లమెంట్‌నూ కుదిపేస్తోంది హిండెన్‌బర్గ్ నివేదిక. ఆ రిపోర్ట్‌పై చర్చకు పట్టుబడుతున్నాయి విపక్షాలు. మల్లికార్జునఖర్గే చాంబర్‌లో సమావేశమైన ప్రతిపక్షాలు..భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం దగ్గర ఆందోళనకు దిగారు. హిండెన్‌బర్గ్ నివేదికపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని.. లేదంటే సుప్రీంకోర్ట్ పర్యవేక్షణలో విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు.

# మొబిలీటీ వ్యాలీ ద్వారా 4 లక్షల ఉద్యోగాలు

**హైదరాబాద్:**

హైదరాబాద్ హెచ్ఐసీసీలో మొబిలిటీ నెక్స్ట్ హైదరాబాద్ సమ్మిట్ ? 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ఈ-మొబిలిటీ వ్యాలీలో భాగంగా వారం రోజుల పాటు హైదరాబాద్ ఈ-మొబిలిటీ వీక్‌ను నిర్వహిం చనున్నారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడకంలో అవగాహన పెంచడానికి హైదరాబాద్ ఈ ? మొబిలిటీ వీక్‌ను ఏర్పాచు చేశారు. ఈవీ రంగానికి ఊతమిచ్చేలా నేటి నుంచి ఈ-మొబిలిటీ వారోత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్ రెడ్డి, ఐటీ శాఖ సెక్రటరీ జయేష్ రంజన్ హాజరయ్యారు. ఇండియాలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్‌లో ఈ సమ్మిట్ నిర్వహించడం సంతోషమని మంత్రి కేటీఆర్ అన్నారు. వాతా వరణాన్ని ప్రధాన అంశంగా తీసుకోవడం అందరికి అవసరమన్నారు. హైదరాబాద్‌లో ఈ ? మొబిలిటీ వీక్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని.. దీనిలో భాగంగానే ర్యాలీని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇండియాలోనే తొలిసారి ఫార్ములా ఈ రేస్ హైదరాబాద్‌లో నిర్వహిస ్తున్నామని మంత్రి వెల్లడించారు. సోలార్ ఎనర్జీలో దేశంలో తెలంగాణ సెకండ్ ప్లేస్‌లో ఉందన్నారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్‌ని ప్రోత్సహిస్తు న్నామన్న మంత్రి.. ఛార్జింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ కంపెనీస్ పెట్టాలి అనుకునే వారికి అన్ని విధాలుగా సహ కారాలు అందిస్తున్నామన్నారు. ఆటోమోటివ్ సొల్యూషన్స్‌లో హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందన్నారు. ఇండియాలోనే మొదటీ మొబిలిటీ వ్యాలీ తెలంగాణ మొబిలిటీ వ్యాలీ అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలం గాణలో ఈవీ మ్యానిఫ్యాక్చర్ క్లష్టర్స్ ఉన్నాయ న్నారు. మోమిన్‌పేట్ లో తెలంగాణ ఈ -మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే మరో 4 మొబిలిటీ క్లష్టర్స్ ఏర్పాటు ప్రకటిస్తామని తెలిపారు. స్టార్టప్స్‌ని, ఇన్నోవేటివ్ ఆలోచనలని సపోర్ట్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే అమర్ రాజా గ్రూప్, హ్యూందాయ్ వంటి చాలా కంపెనీస్ తెలంగాణలో యూనిట్స్ ఏర్పాటు చేస్తున్నా యన్నారు. తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ద్వారా 6బిలియన్ల పెట్టుబడి, నాలుగు లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. కేటీఆర్ సమక్షంలో ప్రభుత్వంతో పలు కంపెనీలు ఎంవోయూలను కుదుర్చు కున్నాయి.

# బాధ్యతలు స్వీకరించిన ఐదుగురు న్యాయమూర్తులు

**న్యూఢిల్లీ :**

సుప్రీం కోర్టులో కొత్తగా ఐదుగురు న్యాయమూర్తులు చేరారు. ఈ ఐదుగురితో కలిసి మొత్తం 32 మంది జడ్జిలు కాగా.. మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే తెలుగు వ్యక్తి జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్ తో పాటు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ మనోజ్ మిశ్ర సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఈ ఐదుగురు జడ్జిలతో ప్రమాణం చేయించారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్య మొత్తం 32కి చేరుకుంది. ఇక ప్రస్తుతం రెండు ఖాళీలు మాత్రమే ఉన్నాయి. దేశ సర్వోన్నత న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం గతేడాది డిసెంబర్ 13వ ఈ ఐదుగురి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన విషయంలో ఈ సిఫార్సులకు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. గత శనివారం నోటిఫికేషన్ జారీ చేయగా... కాగా మిగిలిన రెండు ఖాళీలకు కూడా కొలీజియం గత నెల సిఫార్సులు పంపించింది. ఈ ప్రతిపాదనలపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పని చేస్తున్న జస్టిస్ పమిడిఘంటం నరసింహం తర్వాత సర్వోన్నత న్యాయస్థాన ధర్మాసనంపై కూర్చోబోతున్న రెండో తెలుగు వ్యక్తి జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్. సుధీర్ఘకాలం ఏపీ అడ్వకేట్ జనరల్ గా సేవలు అందించిన ఆయన తండ్రి పి. రామచంద్రా రెడ్డిది చిత్తూరు జిల్లా. జస్టిస్ సంజయ్ కుమార్ 1963 ఆగస్టు 14వ తేదీన హైదరాబాద్ లో జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం కొనసాగించారు హైదరాబాద్ నిజాం కాలేజీలో డిగ్రీ, ఢిల్లీ విశ్వ విద్యాలయంలో న్యాయశాస్త్రం చదివారు. 1988లో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 2000 నుంచి 2003 వరకు ఉమ్మడి ఏపీ హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా సేవలు అందించారు. 2008 ఆగస్టు 8న అదనపు న్యాయమూర్తిగా నియమితులు అయ్యారు. 2010 జనవరి 20వ తేదీన శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2019 అక్టోబర్ 14వ తేదీన పంజాబ్-హరియాణా హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2021 ఫిబ్రవరి 12న మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదోన్నతి పొందారు.

# సీఎం జగన్ వ్యాఖ్యలు కోర్టు ఆఫ్ కంటెప్ట్ పరిధిలోకి వస్తాయి

**అమరావతి :**



ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సులో పాల్గొన్న ఏపీ సీఎం వైఎస్ జగన్ రాజధానిపై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాను త్వరలోనే విశాఖపట్నానికి షిఫ్ట్ అవుతున్నానని వెల్లడించారు. అక్కడి నుంచే పరిపాలన సాగిస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు పారిశ్రామిక వేత్తలు విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం జగన్ కోరారు. సీఎం జగన్ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. జగన్ మూడు రాజధానులు ఏర్పాటు చేస్తూ తెచ్చిన జీవోలను హైకోర్టు కొట్టేసింది. దీంతో జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో రాజధాని అంశంపై విచారణ సాగుతోంది. కోర్టు పరిధిలో రాజధాని అంశం ఉన్నప్పుడు జగన్ రాజధాని అంశంపై వ్యాఖ్యలు ఎందుకు చేస్తారని ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. జగన్ వ్యాఖ్యలపై కోర్టు ధిక్కరణ కింద సుప్రీంకోర్టుకు లేఖ రాస్తానని జై భీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ తెలిపారు.


మరోవైపు సీఎం జగన్ త్వరలోనే విశాఖకు షిఫ్ట్ అవుతానని చేసిన వ్యాఖ్యలపై సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధాని అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. సీఎం జగన్ వ్యాఖ్యలు కోర్టు ఆఫ్ కంటెప్ట్ పరిధిలోకి వస్తాయన్నారు. రాజధాని అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని లక్ష్మీనారాయణ తెలిపారు. కాగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో జగన్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. ఇతరుల మొబైల్ ఫోన్లను ట్యాపింగ్ చేయడం అంత సులువు కాదని ఆయన అన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) రా వంటి అత్యున్నత ఏజెన్సీలకు మాత్రమే ఎవరి టెలిఫోన్నైనా ట్యాప్ చేసే అధికారం ఉంటుందని తెలిపారు. అవన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేవని స్పష్టం చేశారు. ఈ ఏజెన్సీలు కూడా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా టెలిఫోన్ ట్యాపింగ్ చేయగలిగినప్పటికీ.. అయితే అసాధారణమైన పరిస్థితులలో మాత్రమే చేయగలదన్నారు. అది కూడా కేంద్ర హోం కార్యదర్శి అనుమతితో మాత్రమేనని చెప్పారు. అయితే అసాధారణ పరిస్థితుల్లో ఇచ్చిన ట్యాపింగ్ అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే అవకాశం కూడా ఉందన్నారు. రాజకీయ కారణాలతో ట్యాపింగ్ జరిగితే అది ఖచ్చితంగా చట్టవిరుద్ధమని లక్ష్మీనారాయణ తేల్చిచెప్పారు.

అదే సమయంలో.. కేంద్రం నుండి అనుమతి తీసుకోకుండానే రాష్ట్ర ప్రభుత్వాలు తరచుగా ప్రైవేట్ సంస్థల నుంచి ట్యాపింగ్ పరికరాలను కొనుగోలు చేస్తున్నాయని లక్ష్మీనారాయణ తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందన్నారు.

కాగా ఇటీవల రోడ్లపై బహిరంగ సభలు సమావేశాలు ర్యాలీలు రోడ్ షోలను నిషేధిస్తూ జగన్ ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 1కు అనుకూలంగానూ జేడీ లక్ష్మీనారాయణ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

# వచ్చే ఎన్నికల్లో పోటీ

**రాజమండ్రి :**



రానున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. 175కి 175 స్థానాల్లో విజయమే టార్గెట్‌గా పెట్టుకున్నారు.. కొన్ని చోట్ల సిట్టింగ్‌లకు షాక్ తప్పదనే ప్రచారం కూడా సాగుతోంది.. దీంతో.. ఈసారి మాకు అవకాశం వస్తుందని ఎదురుచూసేవాళ్లు లేకపోలేదు.. అయితే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సినీ నటుడు ఆలీ.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్ లో ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు ఆలీ.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు రాష్ట్రాల నుండి టీమ్స్ ను తీసుకువచ్చి రాజమండ్రిలో ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో కొన్ని వందల సినిమాలు షూటింగ్ జరిగాయని గుర్తుచేశారు. ఇక, ఇదే సమయంలో రాజకీయాల గురించి మాట్లాడుతూ.. మా నాయకుడు ఎక్కడ నుంచి ఆదేశిస్తే అక్కడ నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు.. ఎక్కడ పోటీ చేస్తాం అనే దానిపై పుకార్లు అనేవి సాధారణంగా జరుగుతూ ఉంటాయని వ్యాఖ్యానించారు ఆలీ. కాగా, ఈ మధ్యే ఎలక్ట్రానిక్ మీడియా ప్రభుత్వ సలహాదారుగా ఆలీని నియమించారు సీఎం వైఎస్ జగన్.. గతంలోనో ఎన్నికల్లో పోటీపై హాట్ కామెంట్లు చేశారు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని జోస్యం చెప్పారు. పార్టీ ఆదేశిస్తే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై పోటీ చేసేందుకు కూడా సిద్ధమంటూ తిరుపతిలో వ్యాఖ్యానించిన విషయం విదితమే. ఎక్కడి నుంచైనా పోటీకి తాను రెడీ అన్నారు. పవన్ కల్యాణ్ తనకు మంచి స్నేహితుడని, అయితే సినిమాలు వేరు, రాజకీయాలు వేరని ఆలీ చెప్పుకొచ్చిన విషయం విదితమే.. మొత్తంగా ఆలీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారని తెలుస్తోంది. పార్టీ ఆదేశిస్తే.. ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సిద్ధమని ప్రకటించారు. దీంతో, ఆలీ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. అది కూడా పలానా నియోజకవర్గం అంటూ ప్రచారం జోరుగా సాగుతోన్న విషయం విదితమే

# కలకలం రేపుతున్న దస్తగిరి స్టేట్ మెంట్

**కడప :**

వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో అప్రూవర్ గా మారిన వివేకా డ్రైవర్ దస్తగిరి... తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసులో నిజాలేంటో త్వరలో తెలుస్తాయని దస్తగిరి అన్నారు. హైదరాబాద్‌కు కేసు బదిలీ అవ్వడం మంచిదే అన్నారు. ఈ నెల 10న హైదరాబాద్ సీబీఐ కోర్టుకు హాజరు కావాలని నోటీసులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. సీబీఐ అధికారులు పక్కా సమాచారంతో ఈ కేసులో సంబంధం ఉన్న వారిని విచారణకు పిలుస్తున్నారన్నారు. అందులో భాగంగానే వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డిని కూడా విచారణకు పిలిచారన్నారు. ఈ కేసులో ఎవరి పాత్ర ఏంటో సీబీఐ అధికారులు త్వరలోనే వెల్లడిస్తారని నమ్ముతున్నట్లు దస్తగిరి ఆదివారం అన్నారు. వివేకా హత్యకేసులో త్వరలో నిజాలు తెలనున్నాయని, వాస్తవాలు బయటపడే రోజు దగ్గర పడిందని దస్తగిరి అన్నారు. ఇప్పటి వరకూ దస్తగిరి చెప్పింది అబద్ధమని అన్నారని, ఇకపై తాను చెప్పిన నిజాలు ఏంటో ప్రజలకు తెలుస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో విచారణకు సీఎం జగన్ సహకరించి ఉంటే 10 రోజుల్లో కేసు విచారణ పూర్తి అయ్యేదన్నారు. తెలంగాణకు వివేకా హత్య కేసు బదిలీ అవ్వడం మంచిదేనన్నారు.వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ అధికారులు కడప సెంట్రల్ జైల్ గెస్ట్ హౌస్‌లో ఆరున్నర గంటల పాటు ఇద్దర్ని ఇటీవల ప్రశ్నించారు. సీఎం జగన్ ఓఎస్డీగా పని చేస్తున్న కృష్ణమోహన్ రెడ్డి, అలాగే తాడేపల్లిలో సీఎం క్యాంప్ ఆఫీసులో పని చేసే నవీన్ అనే వ్యక్తిని విచారణకు పిలిచింది సీబీఐ. ముందుగా కృష్ణమోహన్ రెడ్డి సీబీఐ ఎదుట హాజరయ్యారు. నవీన్ విచారణకు వచ్చినట్లుగా స్పష్టత లేదు కానీ.. ఆయన సెంట్రల్ జైలుకు వచ్చారని..ఆయనను కూడా రహస్యంగా సీబీఐ ప్రశ్నించిందని చెబుతున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. సెంట్రల్ జైల్ గెస్ట్ హౌస్ లో భారీ భద్రత నడుమ విచారణ జరిగింది. కృష్ణమోహన్ రెడ్డితో పాటు కడప సెంట్రల్ జైల్లో ఇప్పటికే రిమాండ్ లో ఉన్న దేవిరెడ్డి శంకర్ రెడ్డి, యాదాటి సునీల్, ఉమా శంకర్ రెడ్డి లను సీబీఐ విచారించే అవకాశం ఉంది. వైఎస్ వివేకా హత్య జరిగిన రోజు.. ఎంపీ అవినాశ్ రెడ్డి కాల్ డేటాను సీబీఐ పరిశీలించినట్లుగా తెలుస్తోంది. ఇటీవల అవినాష్ రెడ్డిని సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ఆ తర్వాత విచారణలో వెల్లడైన అంశాలను బట్టి నవీన్ , కృష్ణమోహన్ రెడ్డిలకు నోటీసులను సీబీఐ జారీ చేసింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి ఫోన్లను నవీన్ అటెండ్ చేస్తుంటారని చెబుతున్నారు. గతం నుంచి జగన్ వద్ద పనిచేస్తున్న కృష్ణమోహన్ రెడ్డికి వైఎస్ఆర్సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఓఎస్డీగా నియమించారు. వీరిద్దరిని ఆరు గంటల పాటు ప్రశ్నించడంతో తర్వాత సీబీఐ ఎలాంటి అడుగు వేయబోతోందోనన్న ఆసక్తి మొదలైంది.

# రుషికొండ పచ్చ దనం అంతా మాయేనా..

**విశాఖపట్టణం :**

రుషికొండ అంతా పచ్చగా కనిపించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తవ్వేసిన చోట మొత్తం తవ్వినట్లుగా కనిపించకుండా గ్రీన్ కార్పెట్‌ను అధికారులు రాత్రికి రాత్రి పరిచేశారు. గతంలో తవ్విన చోట.. తవ్వినట్లుగా స్పష్టంగా కనిపించేది. కానీ ఈ గ్రీన్ కార్పెట్ ను పరవడంవల్ల దూరం నుంచి చూసిన వారికి కొండ అంతా పచ్చగా కనిపిస్తోంది. అయితే ఇలా ఎందుకు చేశారన్న దానిపై అధికారవర్గాలు ఎలాంటి ప్రకటన చేయలేదు. తవ్వేసిన కొండ ను గ్రీన్ కార్పెట్‌తో కవర్ చేయడంపై సోషల్ మీడియాలో రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి. రుషికొండపై గతంలో ఉన్న రిసార్టును కూలగొట్టి కొండను తవ్వేసి కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలు సీఎం క్యాంప్ ఆఫీస్ అన్న ప్రచారం జరుగుతోంది. అవి సీఎం క్యాంప్ ఆఫీస్ కార్యాలయాలు అయితే తప్పేంటి అని బొత్స సత్యనారాయణ కూడా ఓ సారి ప్రకటించడంతో వాటి నిర్మాణం అందుకే అనుకుంటున్నారు. అయితే కొండను తవ్వేయడం నిబంధనలకు విరుద్ధమని.. అనుమతించిన దాని కన్నా ఎక్కువ తవ్వేశారని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరిపిన హైకోర్టు ఐదుగురు కేంద్ర పర్యావరణ శాఖ అధికారులతో కమిటీని నియమించాలని ఆదేశించింది. సమగ్ర సర్వేకు నియమించే బృందంలో ఐదుగురు సభ్యులను నియమించాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖకు ఏపీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అక్రమ తవ్వకాలను నిగ్గు తేల్చేందుకు సమగ్ర సర్వే చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టుకు నివేదిక సమర్పించిందో లేదో స్పష్టత లేదు. కానీ రుషికొండకు గ్రీన్ మ్యాట్ కప్పడంతో రాజకీయంగా విమర్శలు వస్తున్నాయి. రుషికొండ తవ్వకాల విషయంలో ఏపీలో విపక్షాలు మొదటి నుంచి తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారని.. అనేక వీడియోలు విడుదల చేశారు. విమానంలో నుంచి వెళ్తున్న సమయంలో... తీసిన రుషికొండ ఫోటోలు పలుమార్లు వైరల్ అయ్యాయి. ఆ ఫోటోల్లో.. రుషికొండ చుట్టూ తవ్వేసినట్లుగా స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు ఆ గ్రీన్ మ్యాచ్ ను పెట్టడం వల్ల ఇక అంతాపచ్చగానే కనిపిస్తుందని.. ఎంత మేర తవ్వారో తెలియకుండా ఉంటుందని అందుకే అలా చేస్తున్నారన్న వాదన వినిపిస్తోంది.మరో వైపు రుషికొండపై సర్వే చేయడానికి హైకోర్టు ఆదేశాలతో నియమితులైన కమిటీ పర్యటిస్తుందని.. అందుకే వారికిపెద్దగా కనిపించకుండా ఈ ఏర్పాటు చేస్తున్నారన్న వాదన ఉంది. అయితే పైపైన అధికారులు చూడరని ఎంత మేర తవ్వారో సర్వే కూడా చేస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ కార్యకలాపాలు జోరుగా సాగుతున్నందున.. తవ్వేసిన ప్రాంతం నుంచి దుమ్ము విపరీతంగా లేస్తుందని.. అలా లేవకుండా.. గ్రీన్ మ్యాట్స్ ఏర్పాట్లు చేసి ఉంటారని మరికొంత మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎందుకు ఇలా ఏర్పాటు చేశారో స్పష్టత రావాలంటే.. అధికారులే ప్రకటించాల్సి ఉంది. ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

# దుర్గగుడిలో ఏం జరుగుతోంది...

**విజయవాడ :**

బెజవాడ దుర్గమ్మ.. ఈ పేరు చెబితే చాలు ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. అదే అదే సమయంలో రాజకీయం కూడా హాట్ గా ఉంటుంది. మాజీ మంత్రి, ప్రస్తుత మంత్రి మధ్య విభేదాలతో, ఈవో సెలవు పై వెళ్లాల్సి వచ్చిందనే ప్రచారం హాట్ టాపిక్ గా మారింది.బెజవాడ దుర్గమ్మ ఆలయం లో రాజకీయంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దుర్గమ్మ ఆలయానికి భక్తి భావంతో వచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించి, ఆలయం అభివృద్ధి పని చేసిన ఆలయ అధికారులు, సిబ్బంది,రాజకీయ జోక్యంతో పని చేయాల్సిన వస్తోంది. ఇప్పటికే పలు విధాల ఆరోపణలు వ్యక్తం అయిన క్రమంలో తాజాగా ఆలయ కార్య నిర్వాహణాధికారిణి ధర్భమళ్ల భ్రమరాంబ సెలవుపై వెళ్ళటం చర్చకు దారితీసింది. ప్రస్తుతం ఇంద్రకీలాద్రిపై ప్రస్తుత దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఇదే శాఖకు సేవలు అందించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మధ్య విభేదాల కారణంగా అభివృద్ధి జరగటం లేదనే ప్రచారం ఉంది. అంతే కాదు అధి కారులపై ఒత్తిడి పెరిగిపోవటంతో, పని చేయలేని పరిస్థితులు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇటీవలే దుర్గగుడి ఈవో కు హైకోర్టు నుంచి నోటీసులు వచ్చాయి. కరోనా సమయంలో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఈ వ్యవహారం పైనే ప్రస్తుత మంత్రి, మాజీ మంత్రి మధ్య విభేదాలు వచ్చాయని తెలుస్తోంది. కోర్టు ఆదేశాలతో వచ్చిన వారిని తిరిగి తీసుకోవాలని మాజీ మంత్రి వెలంపల్లి ఒత్తిడి తీసుకు వస్తుండగా, కోర్టు ఆదేశాల పై అప్పీలుకు వెళ్ళే విషయాన్ని పరిశీలించాలని మంత్రి కొట్టు అధికారులను ఆదేశించారని అంటున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో దుర్గ గుడి ఆలయ ఈవో సెలవులకు దరఖాస్తు చేసుకొని వెళ్లారని ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఆయన నియోజకవర్గం పరిధిలోనే దుర్గమ్మ ఆలయం ఉంది. దీంతో ఆయన స్థాని కంగా తన పలుకుబడిని ఉపయోగించి, సీఎం కార్యాలయంలో పరిచయాలు కేంద్రంగా చేసుకొని దుర్గగుడిపై చక్రం తిప్పుతున్నారని, ప్రస్తుత మంత్రి కొట్టు సత్యనారాయణ వర్గం గుర్రుగా ఉంది. దేవాదాయ శాఖలో పని చేసిన వెలంపల్లి, ఆ శాఖ పై పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నించటం, ప్రస్తుత మంత్రిగా ఉన్న కొట్టు సత్యనారాయణను ఇరకాటంలోకి నెట్టే విధంగా ప్రతి విషయంలోనూ వెలంపల్లి జోక్యం చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ప్రచారం ఉంది. దీంతో దుర్గమ్మ ఆలయంలో ఇరువురు నేతల మధ్య సిబ్బంది, అధికారులు నలిగిపోతున్నారని తెలుస్తోంది. ప్రస్తుత మంత్రి కొట్టు సత్యానారాయణ దుర్గగుడికి చెందిన కాటేజీలోనే క్యాంప్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. అక్కడే గతంలో మంత్రిగా వెలంపల్లి కూడా విదులు నిర్వర్తించారు. అయితే స్థానిక శాసన సభ్యుడిగా దుర్గుగుడి కాటేజిలోనే తన కార్యాలయం పని చేయాలని వెలంపల్లి చేసిన ప్రయత్నాలకు, అది ,కారులు అనుమతించలేదు. దీంతో అప్పటి నుంచి వెలంపల్లి , కొట్టు సత్యనారాయణ మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి .వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఈ వ్యవ హారం హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుత మంత్రి కొట్టు సత్యనారాయణని కాదని, అదే శాఖకు గతంలో మంత్రిగా చేసిన వెలంపల్లి శ్రీనివాసరావు ఇష్టానుసారంగా వ్యవహారించటంపై కూడ పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారని స్థానికులు అంటు న్నారు. అయితే వెలంపల్లి ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా కొనసాగుతుండటంతో, జిల్లాలోని మిగిలిన శాసన సభ్యులు సైలెంట్ గా ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ విషయాన్ని మంత్రి కొట్టు సత్యనారాయణ పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

# వందే భారత్ లో స్లీపర్ ట్రైన్స్

**హైదరాబాద్,:**



వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్స్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. రైల్వే రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఇటీవలే కేంద్రం రూ. 2.40 లక్షల కోట్లు కేటాయించింది. మరి కొత్త రైళ్లను త్వరలోనే తీసుకొస్తామని ఇటీవలే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ క్రమంలోనే ఓ ఆసక్తికర ప్రకటన చేశారు. వందేభారత్ ట్రైన్‌లకు స్లీపర్ వర్షన్ రైళ్లు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లోనే తొలి వందేభారత్ స్లీపర్ ట్రైన్ పట్టాలెక్కనున్నట్టు తెలిపారు.ప్రస్తుతం ఉన్న వందేభారత్ ట్రైన్స్‌లో కేవలం చైర్‌కార్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దాదాపు 500-600 కిలోమీటర్లు కవర్ చేసేస్తాయి ఈ రైళ్లు. అయితే... అంతసేపు అలా కూర్చుని ప్రయాణించే బదులు హాయిగా ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేలా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావించారు. ఇందులో భాగంగానే స్లీపర్ కోచ్‌లను జోడించాలని ప్లాన్ చేస్తోంది రైల్వే శాఖ. దూర ప్రయాణాలు చేసే వారికి ఈ వసతి ఎంతగానే ఉపయోగపడుతుందని భావిస్తోంది. 400 కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరం ప్రయాణించే మార్గాల్లో ఈ స్లీపర్ వందేభారత్ ట్రైన్స్‌ను తీసుకు రావాలని యోచిస్తోంది. తక్కువ సమయంలోనే సౌకర్యంగా గమ్య స్థానాలకు చేరుకునే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నిర్ణయం అమలు చేస్తే ఆదాయం పెరగడంతో పాటు ప్రయాణి కులకూ సౌకర్యవంతంగా ఉంటుందని రైల్వే శాఖ భావిస్తోంది. మొట్టమొదట ఢిల్లీ నుంచి కాన్‌పూర్, వారణాసి నుంచి ఢిల్లీ మార్గాల్లో ఈ స్లీపర్ వందే భారత్ ట్రైన్ సర్వీస్‌లు నడవనున్నాయి. రైల్వే శాఖకు చెందిన మానిటరింగ్ కమిటీ దీనిపై పూర్తిస్థాయి రిపోర్ట్ తయారు చేస్తోంది. త్వరలోనే వందే భారత్ మెట్రో సర్వీస్‌లు అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. ఇప్పటికే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు నడుస్తున్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా వందేభారత్ మెట్రో సర్వీస్‌లు నడిపేలా ప్లాన్ సిద్ధం చేసుకుం టోంది మోదీ ప్రభుత్వం. కేంద్ర పద్దుని ప్రవేశపెట్టిన తరవాత రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వివరాలు వెల్లడించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు వందేభారత్ మెట్రో రైళ్లు "మినీ వర్షన్" అని వెల్లడించారు. త్వరలోనే రైల్వేశాఖ వీటిని తయారు చేస్తుందని స్పష్టం చేశారు. నగరాల్లోని ప్రజలకు ఈ సర్వీస్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అయితే..దీనిపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావన రాకపోయినా... రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ మాత్రం ప్రకటన చేశారు. "ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు వందే మెట్రో ట్రైన్‌లు తీసుకురా నున్నాం. సిటీల్లో పూర్తి స్థాయిలో ఈ సేవలు అందుతాయి. పూర్తిగా భారత్‌లోనే వీటిని తయారు చేస్తారు. త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. హోం టౌన్స్ నుంచి సిటీలకు వచ్చే వారికి ఈ సేవలు చాలా ఊరటనిస్తాయి. ఈ ఏడాదే డిజైన్‌ను పూర్తి చేస్తాం. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి వాటి ప్రొడక్షన్‌ను పెంచుతాం"

# తెరపైకి డైవర్షన్ పాలిటిక్స్

**గుంటూరు, :**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి కొడాలి నాని ఎన్టీఆర్ మరణంపై చేసిన కామెంట్స్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో చర్చకు దారితీశాయి. ఎన్టీఆర్ మరణంపై అనుమానాలు ఉన్నాయని, చనిపోయిన తరువాత ఆయనకు పోస్ట్ మార్టం కూడా చేయకుండానే ఖననం చేశారని కొడాలి నాని కామెంట్స్ చేశారు. అంతే కాదు ఈ వ్యవహారంపై ప్రధాని మోదీతో పాటు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును కలసి ఫిర్యాదు చేస్తానని కొడాలి నాని వ్యాఖ్యానించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఈ వ్యవహారం చర్చకు దారితీసింది. అయితే ఇప్పుడే ఈ వ్యవహారంపై కొడాలి నాని ఎందుకు అంతలా కామెంట్స్ చేశారనే అంశంపై అందరిలో చర్చ మొదలైంది. దీని వెనుక ఉన్న కారణాలు చర్చకు దారితీస్తోంది. ఎన్టీఆర్ మరణంపై సీబీఐ విచారణ చేయించాలని నాని డిమాండ్ అమలులోకి వచ్చే పరిస్థితులు ఉన్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పని చేసిన నందమూరి తారక రామారావు మరణించి ఇప్పటికే మూడు దశాబ్దాలు అవుతోంది. ఇప్పుడు ఆయన మరణంపై విచారణ చేయిస్తే ఆధారాలు దొరుకుతాయా? అనుమానాలను మాత్రమే కేంద్రంగా చేసుకొని , ఇప్పుడున్న పాలకులు సీబీఐ విచారణకు అంగీకరించే పరిస్థితులు ఉన్నాయా అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. అంతే కాదు నందమూరి తారక రామారావు వారసులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. ఆయన కుటుంబం నుంచి ఎటువంటి ప్రమేయం లేకుండా కేవలం బయట వ్యక్తులు చేసే ఆరోపణలపై ప్రభుత్వాలు స్పందించే ఛాన్స్ లేదనే వాదన వినిపిస్తోంది. మాజీ మంత్రి కొడాలి నాని వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై కాని, జగన్ పై కాని ఆరోపణలు చేస్తే , ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చే వ్యక్తుల్లో టాప్ 2లో కొడాలి నాని ఒకరు. ఆయన మాట్లాడే మాటలు సంచలనంగా మారుతుండటం, రాజకీయాల్లో చర్చకు దారితీసే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇదే పరిస్థితులు ఇప్పుడు, నందమూరి తారక రామారావు మరణంపై నాని సంచలన వ్యాఖ్యలు చేయటం, వివేకా హత్య కేసును కేంద్రంగా చేసుకొని జరిగిందనే ప్రచారం పొలిటికల్ సెక్టార్ లో నడుస్తోంది. జగన్ పై ప్రతిపక్షాలు విమర్శలు చేయటం, అందులో వివేకా హత్య కేసు విషయంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న నేపథ్యంలో కొడాలి నాని ఎంట్రీ ఇచ్చి, విషయాన్ని పొలిటికల్ గా డైవర్ట్ చేసే పనేనని ప్రతిపక్ష నాయకులు అంటున్నారు. ప్రస్తుతం అధికార పక్షానికి వివేకా వ్యవహారం అత్యంత కీలకంగా మారింది. ఇదే సమయంలో నెల్లూరు రాజకీయాలు, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ట్యాపింగ్ వ్యవహారం వైసీపీకి తలనొప్పిగా మారాయి. వీటన్నింటి నుంచి డైవర్ట్ చేసే పనిలో భాగంగానే ఎన్టీఆర్ మరణ వ్యవహారం తెర మీదకు తెచ్చారా అనే ప్రచారం కూడా లేకపోలేదు.

# సీఎం ను కలిసిన మౌంటనీర్ ఆశా

**అమరావతి**



సైకిల్పై దేశాన్ని చుట్టివస్తున్న ప్రముఖ పర్వతారోహకురాలు ఆశా మాలవ్య సోమవారం నాడు సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ను కలిసింది. ఆశా మాలవ్యను ప్రత్యేకంగా అభినందించిన సీఎం వైయస్ జగన్, ఆమె లక్ష్యం నెరవేరాలని ఆకాంక్ష, రూ. 10 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. సైకిల్పై దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 25,000 కిలోమీటర్లు ప్రయాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, ఇప్పటివరకు ఏపీ సహా 8 రాష్ట్రాల్లో 8 వేలకు పైగా కిలోమీటర్లు పూర్తయిందని సీఎంకి ఆశా మాలవ్య వివరించారు. మధ్యప్రదేశ్లోని రాజ్గర్ జిల్లా నతారామ్ గ్రామానికి చెందిన ఆశా మాలవ్య మహిళా భద్రత, మహిళా సాధికారత అంశాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకెళ్ళేందుకు దేశవ్యాప్తంగా ఒంటరిగా సైకిల్యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తాడేపల్లిలో సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ను కలిశారు. ఆశా మాలవ్య కృషిని సిఎం ప్రశంసించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య, ఇతర సీఎంవో అధికారులు పాల్గోన్నారు..

## రెండో సీజన్ లో కూడా అన్ స్టాపడబుల్ జోష్

**హైదరాబాద్ :**

“ఆహా” ఓటీటీ లో సూపర్ హిట్ టాక్ షో ‘అన్ స్టాపడబుల్’. ఒక సీజన్ ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని రెండో సీజన్ లో కూడా అదే జోష్ తో దూసుకుపోతుంది. దీనికి వ్యాఖ్యాత బాలకృష్ణ సెంటరాఫ్ ఎట్రాక్షన్ అయితే, వచ్చే గెస్టులు సెన్సేషన్. ఆ తరహాలోనే ఇటీవల ఈ షోకు సినీ నటుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వచ్చారు.ఇప్పటికే దీనికి సంబంధించిన తొలి భాగం విడుదలైంది. త్వరలోనే రెండో భాగాన్ని విడుదల చేయనున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది ఆహా. ఈ ప్రోమోలో బాలకృష్ణ, పవన్ మధ్య జరిగిన సరదా సంభాషణలను చూపించారు. తెలుగుదేశంలో చేరొచ్చు కదా? కొత్త పార్టీ ఎందుకు? అని పవన్ను ప్రశ్నించారు బాలయ్య. “సినిమాలను పూర్తిగా వదిలేసి.. రాజకీయాల్లోకి రావాలంటే ఏం చేస్తారు” అని అడిగారు. వాటితోపాటు పవన్ను బాలయ్య పలు ఆసక్తికర ప్రశ్నలు అడిగారు.బాప్ ఆఫ్ ఆల్ ఎపిసోడ్గా ఆహా ఎప్పటి నుంచో ఈ ఎపిసోడ్ను ప్రచారం చేస్తోంది. అందుకు తగ్గట్టుగానే అన్స్టాపబుల్ పవన్ కల్యాణ్ ఎపిసోడ్ ఒకటో భాగం సూపర్ హిట్ అయ్యింది. పలు రికార్డులు బద్దలుగొట్టిందని తెలుస్తోంది. కాగా, మొదటి ఎపిసోడ్ మంచి కిక్ ఇచ్చింది.ఇప్పుడీ ఎపిసోడ్ అంతకు మించి ఉండబోతోందని అనిపిస్తోంది. ఈ పార్ట్-2లో బాలకృష్ణ రాజకీయాలు ప్రధానంగా. పవన్పై ప్రశ్నలు సంధించారు. ఈ మేరకు.. గతేడాది పవన్ను ఓ పర్యటనలో పోలీసులు ఆపేస్తే జనసేనాని కారుపై ఎక్కారు. ఆ ఫొటోను చూపిస్తూ ‘ ఏమిటి ఆ గొడవ ‘ అని అడిగారు బాలయ్య. దానికి పవన్. .’కారులో వెళ్ల కూడదు, కారు నుంచి బయటకు రాకూడదు, రూమ్లో ఉండకూడదు, అందు లోంచి బయటకు రాకూడదు.. అందుకే కొన్ని రోజుల తర్వాత నాకు తిక్క వచ్చింది’ అని అన్నారు.

## హోళికి ముందే ఉద్యోగులకు గుడ్ న్యూస్

**న్యూఢిల్లీ :**

ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం నుంచి శుభవార్త రాబోతోంది. కోటి మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యాన్ని పెంచనుంది కేంద్ర ప్రభుత్వం. ఏడీ ని ప్రభుత్వం 38 శాతం నుంచి 42 శాతానికి పెంచే సూచనలు కనిపిస్తున్నాయి. ఫిక్స్‌డ్ ఫార్ములా కింద డియర్‌నెస్ అలవెన్స్‌ను పూర్తిగా 4 శాతం పెంచే ఛాన్స్ ఉంది. ఇందుకు సంబంధించి అధికార వర్గాల నుంచి సమాచారం అందుతోంది.డియర్‌నెస్ అలవెన్స్, డియర్‌నెస్ రిలీఫ్ ను ప్రతి సంవత్సరం జనవరి 1, జూలై 1 నుండి పెంచే నియమం కేంద్ర ప్రభుత్వం కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రస్తుతం డీఏను 4 శాతం పెంచనుందని సమాచారం.కేంద్రం ప్రభుత్వం డీఏ పెంచుతూ ప్రకటన చేస్తే.. కోటి మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం (డీఏ) ప్రస్తుతం ఉన్న 38 శాతం నుంచి 42 శాతానికి పెరుగుతుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ ప్రతి నెలా లేబర్ బ్యూరో విడుదల చేసే పారిశ్రామిక కార్మికుల వినియోగదారుల ధరల సూచిక ఆధారంగా లెక్కించబడుతుంది. లేబర్ బ్యూరో అనేది కార్మిక మంత్రిత్వ శాఖలో ఒక భాగం.డీఏ 4.23 శాతం ఉండే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. మొత్తంగా ఇది 38 శాతం నుంచి 42 శాతానికి చేరుకుంటుందని, ఆర్థిక మంత్రిత్వ శాఖ దీనిపై ప్రతిపాదన చేస్తుందన్నారు. కేంద్రమంత్రివర్గం ఆమోదం తరువాత.. దీనిపై అధికారిక ప్రకటన వెలువడుతుందని చెప్పారు. అయితే, పెరగనున్న డీఏ జనవరి 1, 2023 నుంచి వర్తిస్తుందన్నారు.

## జాతర భక్తులకు మజ్జిగ పంపిణీ

**తాడిపత్రి**

రాయలసీమ నాలుగు జిల్లాల నుండి వచ్చి వెల్లే శ్రీ శ్రీ శ్రీ పప్పూరు అశ్వత్థ నారాయణ స్వామి భక్తాదులకు అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చిన్న పోలమడ దగ్గర ఉన్న పెద్ద పప్పూరు రోడ్డులో ఉచిత మజ్జిగను ఈ ఏడాది కూడా తిప్పి రెడ్డి నాగార్జున రెడ్డి ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే తిరునాళ్ళకు వచ్చి వెల్లే రాయలసీమ ప్రజలకు మజ్జిగను ఏర్పాటు చేయడం నాకు ఆనవాయితీగా మారింది కాబట్టి నాలుగు, ఐదో ఆదివారం తిరునాళ్ళకు కూడా మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేస్తానని తెలిపారుఉ. ఈ వారం దాదాపు పదివేల మందికి దాహం



తీర్చడమైనదని సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో టీ ఎన్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పుట్లూరు బాస్కర్ రెడ్డి, బుడ్డ దాసరి విన్నయ్య,నూర్ మహమ్మద్, దూదేకుల కుళ్లాయప్ప, యక్కలూరు రంగనాయకులు, రాసిపోగుల మల్లికార్జున, బెల్డోన్ చంద్ర శేఖర్, చిన్న పోలమడ థామస్, ఖాదర్, శీనా, వెన్నుపూస శివశంకర్ రెడ్డి,పులిచెర్ల నారాయన స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికే గర్వకారణం మన సచివాలయం

**హైదరాబాద్**

తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో రహదారులు, భవనాల శాఖ పరిధిలో 24,245 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే ఉండేవి. రాష్ట్రం ఏర్పడిన తరువాత 2,727 కోట్లతో 1875 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్ల నిర్మాణాన్ని కొత్తగా చేపట్టింది. వీటిలో 1684 కిలోమీటర్ల రోడ్లు పూర్తయ్యాయి. 3134 కోట్ల ఖర్చుతో 717 వంతెనల నిర్మాణం చేపట్టగా.. వాటిలో 350 వంతెనల నిర్మాణం పూర్తయిందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.సోమవారం నాడు అయన శాసనమండలిలో ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 29 జిల్లాల్లో 1581 కోట్లతో సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టింది. వీటిలో 17 భవనాలను ఇప్పటికే ప్రారంభించుకున్నాం. మరో 11 కలెక్టరేట్ల పనులు తుది దశలో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కలెక్టరేట్ భవనాలు కొన్నిరాష్ట్రాల సచివాలయ భవనాలకన్నా మిన్నగా ఉన్నాయని పలువురు ప్రముఖులు ప్రశంసించారని అన్నారు.

తెలంగాణ అస్తిత్వాన్ని సమున్నతంగా చాటే విధంగా నిర్మితమైన సెక్రటేరియట్ భవనానికి ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టడంతో దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురిసింది. అధునాతన వసతులతో 7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో 7 అంతస్తుల సచివాలయ భవనం నిర్మాణం పూర్తయింది. ఈ సచివాలయాన్ని ఫిబ్రవరి 17న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకోబోతున్నాం. రాష్ట్రానికే గర్వకారణమైన సెక్రటేరియట్ భవనాన్ని కాలంతో పోటీ పడుతూ వేగంగా నిర్మింపజేసిన అధికారులకు, ఇంజినీర్లకు, కార్మికులకు అభినందనలని అన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు లో ఎదురుదెబ్బ

**హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు చుక్కెదురయింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక తీర్పు ఇచ్చింది. ప్రభుత్వ అప్పీల్ పిటిషన్ ను విచారించిన చీఫ్ జస్టిస్ బెంచ్ దాన్ని కొట్టివేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు ను చీఫ్ జస్టిస్ బెంచ్ సమర్ధించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సిబిఐ తో విచారణ జరిపించాలని సింగిల్ బెంచ్ తీర్పు అమలు చేయాలనీ సిబిఐ కి ఆదేశించింది. ప్రభుత్వం అప్పీల్ పిటిషన్ కొట్టివేసింది.

# చైనా యాప్స్ కు మళ్లీ గడ్డుకాలం

**న్యూఢిల్లీ,:**

లోన్ యాప్స్ ఎంత మంది ప్రాణాలను బలిగొంటున్నాయో చూస్తూనే ఉన్నాం. రోజూ ఏదో ఓ మూల ఎవరో ఒకరు ఈ లోన్ యాప్‌ల వేధింపులకు గురవుతున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలాంటి యాప్స్‌పై ఇప్పటికే కేంద్రం ప్రత్యేక నిఘా పెట్టింది. అనధికారిక యాప్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అందుకు తగ్గట్టుగానే చర్యలు మొదలు పెట్టింది. ఇదే సమయంలో బెట్టింగ్ యాప్స్‌పైనా కొరడా ఝుళిపించింది. 138 బెట్టింగ్ యాప్స్‌తో పాటు 94 లోన్ యాప్స్‌పై నిషేధం విధించింది. ఇవన్నీ చైనాకు చెందినవే. సమస్య తీవ్రత ఆధారంగా వెంటనే ఈ నిషేధాన్ని అమల్లోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించింది. హోం మంత్రిత్వ శాఖ సూచనల మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. దేశ సమైక్యతను దెబ్బ తీసే విధంగా ఉన్న యాప్స్‌ను తొలగిస్తున్నట్టు స్పష్టం చేసింది. గతేడాది దేశ భద్రతకు భంగం కలిగిస్తున్న 54 చైనా యాప్స్‌ను నిషేధించింది కేంద్రం. వినియోగదారుల వ్యక్తిగత వివరాలను సేకరించి దుర్వినియోగం చేస్తున్నట్టు గుర్తించిన కేంద్రం...వాటిని తొలగించింది. పౌరుల ప్రైవసీని దెబ్బ తీసే యాప్స్ పని పడతామని తేల్చి చెప్పింది. 2020లోనూ 59 యాప్స్‌ను బ్యాన్ చేసింది. ఆ తరవాత అదే ఏడాది సెప్టెంబర్‌లో 118 యాప్స్‌ని బ్లాక్ చేసింది. చట్ట విరుద్ధమైన లోన్ యాప్‌లపై కేంద్రం సీరియస్ అయింది. వీటిపై చర్యలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో గతేడాది ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. అక్రమ లోన్ యాప్‌లపై కఠిన చర్యలకు ప్రణాళిక రచించింది. చట్టబద్ధమైన యాప్‌ల వైట్ లిస్ట్‌ను తయారు చేయాలని ఆర్‌బీఐకు కేంద్రం ఆదేశించింది. వైట్ లిస్ట్‌లో ఉన్న లోన్ యాప్‌లను మాత్రమే యాప్ స్టోర్‌లలో హోస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. అక్రమ లోన్ యాప్‌ల లావాదేవీలపై ఈడీ, సీబీఐ దృష్టి సారించాలని నిర్ణయించింది. అక్రమ లోన్ యాప్‌ల ఆట కట్టించేందుకు అన్ని మంత్రిత్వశాఖలు, ఏజెన్సీలు కలిసికట్టుగా పనిచేయాలని సమావేశంలో కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. ఆన్లైన్ లోన్ యాప్ ల ఆగడాలకు దేశవ్యాప్తంగా ఎంతో మంది బలైపోయారు. లోన్ యాప్‌లో రుణం తీసుకుంటే ఇక చావే శరణ్యం అన్నంతగా వేధిస్తున్నారు రికవరీ ఏజెంట్లు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎంతో మంది ఉసురు తీశాయి లోన్ యాప్‌లు. ఇటీవల రాజమహేంద్రవరంలో దంపతులు ఆత్మహత్యకు కారణమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తరహాలోనే ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ ఆలోచిస్తోంది. జనాలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న లోన్ యాప్స్ పై ఉక్కుపాదం మోపింది. సుమారు 2 వేల పర్సనల్ లోన్ యాప్స్ ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించింది. ఇందులో చాలా వరకు విదేశాలకు చెందిన లోన్ యాప్స్ ఉన్నాయి. ఇవన్నీ భారతీయులను టార్గెట్ చేసుకుని తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటి కారణంగా అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గూగుల్ గుర్తించింది. దీంతో స్థానిక చట్ట సంస్థల అభిప్రాయాల మేరకు వీటిని తొలగిస్తున్నట్లు గూగుల్ ఆసియా పసిఫిక్ సీనియర్ డైరెక్టర్ సాయికత్ మిత్రా వెల్లడించారు. ముమ్ముందు మరిన్ని యాప్స్ మీద వేటు వేయబోతున్నట్లు తెలిపారు. ఇలాంటి యాప్స్ నుంచి రక్షణ కోసం పాలసీ విధానంలో కీలక మార్పులు తీసుకురాబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

# కేజ్రీవాల్ కు లిక్కర్ సెగ

**న్యూఢిల్లీ, :**

ఢిల్లీ లిక్కర్ స్కాం కు సంబంధించి ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జ్ షీట్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేరు ప్రముఖంగా చోటు చేసుకుంది. నిజానికి ఇది అనూహ్య పరిణామం కాదు. అయినా, ఢిల్లీ రాజకీయాలలో మాత్రం ప్రకంపనలు సృష్టిస్తోంది. .కేజ్రీవాల్ టార్గెట్‌గా బీజేపీ కార్యకర్తలు నిరసన బాట పడుతున్నారు. తాజాగా ఢిల్లీలోఆప్ ఆఫీస్ ముందు బీజేపీ నిరసనకు దిగడం ఉద్రిక్తతలకు దారి తీసింది. కేజ్రీవాల్ వ్యతిరేక నినాదాలతో ఢిల్లీ మారుమోగుతోంది. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ కార్యకర్తలను కంట్రోల్ చేయడం పోలీసుల వల్ల కాలేదు. ఆఫీస్ ముందు ఏర్పాటు చేసిన బారికేడ్లను దూకేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రయత్నించారు. మరోవైపు ఈ ఆరోపణలను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ కేసు ఫేక్ అని.. ప్రభుత్వాలను కూలదోయడానికి బీజేపీకి ఈడీ సాయం చేయడమేనని కేజ్రీవాల్ ఆరోపించారు. లిక్కర్ స్కాం ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ నాయర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో ఫేస్ టైం వీడియోకాల్ ద్వారా సమీర్ మహేంద్రుతో మాట్లాడించినట్లు ఈడీ ఛార్జ్ షీటులో పేర్కొంది. ఈ లావాదేవీల ద్వారా వచ్చిన సొమ్మును ఆమ్ ఆద్మీ పార్టీ గోవాలో ఎన్నికల ప్రచారానికి వాడుకుందని ఆరోపించింది. లిక్కర్ లైసెన్సులు ఇప్పించేందుకుగానూ ఆప్ నాయకుల తరఫున విజయ్ నాయర్ సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్లు అడ్వాన్స్ తీసుకున్నట్లు గుర్తించినట్లు ఈడీ చెబుతోంది.మరో వంక ఢిల్లీ లిక్కర్ స్కాం ఢిల్లీలోనే కాదు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది.. ఈ కేసులో ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుని నిందితులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఫిబ్రవరి 23కి వాయిదా వేసింది. ఈడీ దాఖలు చేసిన రెండో ఛార్జిషీట్‌లో అరవింద్ కేజ్రీవాల్‌తో పాటుగా తెలంగాణ ఎమ్మెల్సీ కవిత, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్లు కూడా చేర్చడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో, ఎవరి మెడకు చుట్టుకుంటుందోననే చర్చఆసక్తి రేకిస్తోంది.ఎమ్మెల్సీ కవిత అనుచరుడు వి.శ్రీనివాసరావును విచారించినట్లు ఛార్జిషీట్ లో ఈడీ తెలిపింది. కవిత ఆదేశాలతోనే అరుణ్‌పిళ్లైకి శ్రీనివాసరావు రూ.కోటి ఇచ్చారని ఈడీ స్పష్టం చేసింది. ఈ స్కామ్ ద్వారా వచ్చిన డబ్బునే ఆమ్‌ఆద్మీ పార్టీ గోవా ఎన్నికల ప్రచారానికి ఖర్చు పెట్టిందని ఈడీ వెల్లడించింది. రెండో చార్జ్‌షీట్లో ఈడీ ఈ విషయం స్పష్టం చేసింది. ఈడీ చెప్పిన వివరాల ప్రకారం, ఆప్ సర్వే టీమ్‌లకు దాదాపు రూ.70 లక్షలు చెల్లించింది. ఈ పార్టీ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ ప్రచారంలో పాల్గొన్న వాళ్లకు డబ్బులు అందేలా చూశారని ఈడీ తెలిపింది. అయితే అటు ప్రతిపక్షాల నుంచి అదానీ గోల్ మాల్ హస్త్రం దూసుకోస్తోంది. ఇదే అంశం పై ఇప్పటికే వరసగా రెండు రోజుల పాటు పార్లమెంట్ ఉభయ సభలను స్తంబింప చేసిన విపక్షాలు, అదానీ అస్త్రాన్ని నేరుగా ప్రధాని మోడీ మీదకు ఎక్కుపెడుతున్నాయి. చివరకు అదేమవుతుంది, ఇదేమవుతుంది అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ...చివరకు ఏమవుతుంది అనేది ముందుముందు చూడవలసిందే .. అంటున్నారు.

# ఈజీ మనీ కోసం డ్రగ్స్ దందా

**హైదరాబాద్ :**

సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురు యువకులను కూకట్ పల్లి ఎస్ఓటీ పోలీసులు అరెస్టే చేశారు. 24 ఏళ్ల పవన్ కుమార్ అనే ఓ వ్యక్తి.. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. మరోవైపు అధిక మొత్తంలో డబ్బులు సంపాదించేందుకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలోనే నైజీరియన్ దగ్గర నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి తీసుకొచ్చి హైదరాబాద్ లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలోనే కూకట్ పల్లిలోని రంగదాముని చెరువు సమీపంలో పవన్ కుమార్ వేరే వాళ్లకు డ్రగ్స్ అమ్ముతుండగా.. ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. అతడితో పాటు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న హరి కృష్ణ(21), కిరణ్ తేజ(20), సాయి కుమార్(24), రఘు(23) అనే నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరో నిందితుడు నదిలా అలీ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు. నిందితుల వద్ద నుండి 18 గ్రాములు ఎండీఎంఏ డ్రగ్స్ తో పాటు నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వాటి విలువ లక్ష రూపాయల వరకు ఉంటుందని డీసీపీ వెల్లడించారు. వారంతా యువకులేనని, ఉన్నత చదువు పూర్తయ్యాక జాబ్ సెర్చింగ్ కోసం చూస్తున్న సమయంలో ఈజీ మనీ కోసం ఇలాంటి పని చేశారని పోలీసులు వెల్లడించారు.”సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు సైబారాబాద్ కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పోలీస్ విభాగం అలాగే ఎస్ఓటీ విభాగం ముఖ్యంగా డ్రగ్స్ పెడ్లర్స్ మీద గానీ వినియోగదారుల మీద గానీ గట్టి నిఘాను ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా బాలానగర్ పరిధిలోని కూకట్ పల్లి డివిజన్ లో నిన్న ఎస్ఓటీ వాళ్లకు, కూకట్ పల్లి పోలీసులకు సమాచారం రావడం.. ఆ పక్కా సమాచారంతో కూకట్ పల్లిలోని ఐడియల్ పాండ్



దగ్గర మనం ఒక ఐదుగురిని అదుపులోకి తీసుకున్నాం. గచ్చిబౌలిలోని నివాసం ఉండే విజయవాడకు చెందిన హరికృష్ణ, బెంగళూరులో ఉండే అనంతపురంకు చెందిన సాయి కుమార్, కిరణ్ తేజ్, పవన్, రఘునందన్ సాంబమర్తి.. ఈ ముగ్గరు కూడా గుంటూరు తాడేపల్లి ఏరియాకు సంబంధించిన వాళ్లు. ఈ ఐదుగురిని అనుమానాస్పద స్థితిలో మనం అదుపులోకి తీసుకొని సెర్చ్ చేయడంతో వీరి దగ్గర నుంచి 18 గ్రామ్స్ ఎండీఎంఏ మెటీరియల్ ను సీజ్ చేయడం జరిగింది.” - బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు హైదరాబాద్ శివారులో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. సుమారు 18 లక్షల విలువైన డ్రగ్స్ ,178 గ్రాముల కొకైన్ హాయత్ నగర్ ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నైజీరియాకు చెందిన గాడ్విన్ ఇంపీయాగ్ ను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ లో డ్రగ్స్ సప్లై చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. బెంగుళూరు నుంచి డ్రగ్స్ ను హైదరాబాద్ కు తీసుకువస్తున్నట్లు హయత్ నగర్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. గతంలో దుల్ పేట్ డ్రగ్స్ కేసులో గాడ్విన్ అరెస్ట్ అయ్యాడని అన్నారు. నిందితుడు నకిలీ పాస్ పోర్ట్ తో ట్రావెల్ చేస్తున్నాడని పోలీసులు గుర్తించారు. 3 నెలలో 400 సిమ్ కార్డులు ఉపయోగించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. 2015 లో చదువు నిమిత్తం హైదరాబాద్ వచ్చిన గాడ్విన్ ఇంపీయాగ్ ఆంధ్రప్రదేశ్ లో కొంత కాలం ఉన్నాడని అన్నారు. వీసా గడువు ముగిసినా ఇల్లీగల్ గా దేశంలో ఉంటున్నాడని తెలిపారు. నిందితుడు రెండు పాస్ పోర్ట్ లు కలిగి ఉన్నాడన్నారు. బెంగళూరుకు చెందిన అస్లాం నుంచి డ్రగ్స్ తెచ్చాడన్నారు. బోర్నవిటా డబ్బాలో డ్రగ్స్ ను హైదరాబాద్ తీసుకొచ్చాడని చెప్పారు.”బెంగళూరు నుంచి బస్ లో హైదరాబాద్ కు డగ్స్ తీసుకొచ్చాడు. బెంగళూరు నుంచి 200 గ్రాములు తెచ్చాడని చెప్పుతున్నాడు. అందులో 178 గ్రాముల డ్రగ్స్ మాత్రమే దొరికింది. 22 గ్రాములు అమ్మేసినట్లు చెపుతున్నాడు. దూల్ పేట్ కేసులో అరెస్ట్ అయ్యాడు. మూడు నెలల పాటు జైల్లో ఉన్నాడు. బెయిల్ పై బయటకు వచ్చి మళ్లీ ఈ దందా చేస్తున్నాడు.

## శృతిమించిన భారాస ఆగడాలు

**హైదరాబాద్**

హుజురాబాద్ లో ఉన్న ప్రశాంత వాతావరణంను అధికారపక్షం నేతలు చెడగొడుతున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. ప్రజల మీద దాడులు చేస్తున్నారు. బీజేపీ కార్యకర్తలను అకారణంగా కొడుతున్నారు. నిన్న మా మీదనే దాడి చేస్తే.. దాడి చేసిన వారిని వదిలిపెట్టి.. మళ్లీ మా నేతలు, కార్యకర్తలను టాస్క్ ఫోర్స్ పోలీసులు తీసుకొని వెళ్లి విపరీతంగా కొడుతున్నారని అయన అన్నారు.
ఈ అరాచకం ఎక్కువ రోజులు చెల్లదు. అధికారపక్షం ఆగడాలు శృతిమించాయి. పోలీసులు అధికారపక్షం తొత్తులుగా మారారా? టాస్క్ ఫోర్స్ పోలీసులు తీసుకుపోవలసిన అవసరం ఏంది ? కొట్టడం ఏంటి? డీజీపీ చట్టం పనిచేస్తుందా ? లేదా ? మాట్ల రమేష్, మాట్ల కళ్యాణ్, పంగిడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్, పిల్లి సతీష్,తుమ్మ శోభన్ లని వెంటనే విడుదల చేయాలని అయన డిమాండ్ చేసారు.

## 6నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభం

**చిత్తూరు**

సోమవారం ఉదయం మంగసముద్రం క్యాంప్ సైట్ నుంచి టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించారు. అంతకుముందు సెల్ఫీ విత్ లోకేష్ కార్యక్రమం జరిగింది. ప్రతీ రోజు సుమారుగా 1000 మందికి క్యాంప్ సైట్ వద్ద లోకేష్ సెల్ఫీలు ఇస్తున్నారు. ప్రతి రోజు తనని కలవడానికి వచ్చిన ప్రజలు, అభిమానులు, కార్యకర్తల్ని కలిసి సెల్ఫీలు దిగుతున్నారు.

## అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



**కొత్తపేట**

కొత్తపేట నియోజక వర్గం ఆలమూరు మండలం మడికి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం కాగా రెండు కుటుంబాలు నిరాశ్రులవ్వగా భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాలు ప్రకారం సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గళ్ళ నాగ వరలక్ష్మి, దేవరపు?డి సత్యవతి నివాసముంటున్న ఇల్లుకు ప్రమాదాస్తు మంటలు అంటుకోవడంతో ఇల్లు అంతా వ్యాపించి ఒక్కసారిగా ఇల్లు దగ్ధం అవ్వగా ఇంట్లో ఉన్న దుస్తులు, వంట పాత్రలు, ఎలక్ట్రానిక్ సామాన్లు, బంగారు ఆభరణాలు, ఇటీవలే బ్యాంకు నుండి తీసుకున్న డ్వాక్రా నగదు మంటలకు కాలి బూడిదవ్వగా ఆస్తి నష్టం భారీగానే సంభవించినట్లు తెలిపారు. కాగా విషయము తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకుని మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో కట్టుబట్టలతో రెండు కుటుంబాల వారు ప్రాణాలతో బయటపడ్డారు. సర్వం కోల్పోయిన ఇరు కుటుంబాలను ఆదుకోవాలని స్థానికులు కోరుతన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

**విజయవాడ**

కృష్ణా జిల్లా పెనమలూరు పీఎస్ పరిధిలో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో బెల్ట్ తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు విజయవాడ ఆడిటర్ జనరల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసరుగా పని చేస్తున్న అగిరస బాబు. విగతజీవిగా చూసిన భార్య అనూష పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసారు. దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా?ప్రయాణికులకు గాయాలు

**కొమురం భీమ్ ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో ఆర్టీసి హైటెక్ బస్సు బోల్తా పడింది. డ్రైవర్ కు ఛాతిలో నొప్పి రావడంతో స్టీరింగ్ పై పట్టు తప్పింది. దాంతో అదుపు తప్పిన బస్సు బోల్తా పడింది. ఘటనలో పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

## ముగిసిన పాతగుట్ట బ్రహ్మోత్సావాలు

**యాదాద్రి**

యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి...పాతగుట్ట లక్ష్మీ నరసింహుడికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు అర్చకులు... వేదమంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారికి అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు అర్చకులు.

# గవర్నర్ ఢిల్లీ టూర్ పై ఆసక్తి...

**హైదరాబాద్ :**

తెలంగాణ గవర్నర్ తమిళిసై ఢిల్లీకి వెళ్లనున్నట్లు సమచారం. ఒకరోజు పర్యటనలో భాగంగా గవర్నర్ ఢిల్లీకి వెళు_న్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో గవర్నర్ తమిళి సై తెలంగాణలో తాజా పరిస్థిత ులను కేంద్రానికి వివరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గవర్నర్ ఢిల్లీ టూర్ పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఢిల్లీలో వివిధ కార్యక్రమాల్లో గవర్నర్ పాల్గొననున్నట్లు సమాచారం. దీంతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో తమిళి సై భేటీ అయ్యే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణలో రాజ్ భవన్ , ప్రగతి భవన్ మధ్య పరిస్థితులు మెరుగు పడినట్లు కనిపిస్తున్నా ఏ క్షణంలోనైనా వార్ రిస్టార్ట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీతో సంబంధాలు క్షీణించిన తర్వాత కేసీఆర్ కేంద్రంపై తరచూ విమర్శలు చేయడం మొదలుపెట్టారు. దీంతో గవర్నర్ వ్యవస్థనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం గవర్నర్ సాయంతో రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే గవర్నర్ కు సరైన ప్రొటోకాల్ పాటించడంలేదని రాజ్ భవన్ తరఫున నుంచి వినిపిస్తున్న వాదనలు. రిపబ్లిక్ డే వేడుకలు జరపకపోవడంపై కేంద్రానికి రిపోర్ట్ పంపినట్లు గవర్నర్ తమిళి సై ఇటీవల ప్రకటించారు. అలాగే బడ్జె?ట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై ముందు క్లారిటీ ఇవ్వకపోవడంతో.. బడ్జెట్ ఆమోదానికి కొంత సమయం తీసుకున్నారు గవర్నర్. బడ్జెట్ సమావేశాలు దగ్గరు వస్తున్నా గవర్నర్ కావాలనే బడ్జెట్ ప్రతిపాదనను ఆమోదించలేదని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోపించింది. అనంతరం గవర్నర్ పై హైకోర్టుకెక్కింది. ఆ తర్వాత నిర్ణయం మార్చుకుని కోర్టులో పిటిషన్ వెనక్కి తీసుకుని, గవర్నర్ స్పీచ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ స్పీచ్ ఆసక్తికరంగా మారింది. ఈ ప్రసంగంలో తెలంగాణ ప్రభుత్వాన్ని మెచ్చుకోవడంతో పాటు కేంద్రాన్ని విమర్శించేలా రాష్ట్ర ప్రభుత్వం పంపిన స్పీచ్ ను గవర్నర్ యథావిధిగా చదివారు. గవర్నర్ స్పీచ్ పై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడంతో తమిళి సై పంతం నగ్గించుకున్నారని అందరూ అనుకున్నా.. కేసీఆర్ వ్యూహాత్మకంగా గవర్నర్ తోనే కేంద్రంపై విమర్శలు చేయించారని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య పరిస్థితులు మెరుగుపడుతున్న తరుణంలో తమిళి సై ఢిల్లీ టూర్ పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఢిల్లీ టూర్ అనంతరం గవర్నర్ ఎలా వ్యవహరిస్తారో అన్న దానిపై విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. కేసీఆర్ జాతీయ పార్టీని ముందుకు తీసుకువెళ్తున్న సమయంలో కేంద్రంలోని బీజేపీ కేసీఆర్ అడ్డుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. గత కొంత కాలంగా ప్రగతి భవన్, రాజ్ భవన్ మధ్య వార్ నడిచింది. ప్రొటోకాల్ పాటించడంలేదని గవర్నర్, ప్రభుత్వంలో జోక్యం చేసుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ వివాదం ముదురుతున్న వేళ బడ్జెట్ సమావేశాలు వచ్చాయి. ఈ సమావేశాల్లో గవర్నర్ స్పీచ్ కు ప్రభుత్వం అంగీకరించడంతో కొంత సయోధ్య కుదిరినట్లు అయింది. అయితే భవిష్యత్తు లో పరిస్థితుల మారతాయా? మళ్లీ మొదటికి వస్తాయా? వేచిచూడాలి.

# కాసిపేటలో హత్ సే హత్ జోడో

**కాసిపేట**



కాసిపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ పిలుపు మేరకు హత్ సే హత్ జోడో అభియాన్ యాత్ర గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద గల పార్టీ జెండాను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల కృష్ణ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ గారు దేశాన్ని ఐక్యం చేయుటకు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో పాదయాత్ర ముగింపు సందర్భంగా దానిని కోనసాగింపు గా ఈ రోజు రాష్ట్రమంతా రాహుల్ గాంధీ గారి సందేశం గడప గడపకు ఇచ్చుటకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ రోజు దేశంలో విద్వేషం, విభజన ప్రజల మధ్య చిచ్చు రేపి అధికారం కోసం అడ్డదారులు తొక్కడం అంత్యంత హేయమైన చర్య అని, అలాగే రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి అవినీతి చేస్తూ కుటుంబ పాలన చేస్తూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ లో తెలంగాణ ఆకాంక్షలు నెరవేరకముందే జాతీయ పార్టీ పెట్టి మరోసారి సెంటిమెంట్ తో రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తుంది కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి ఈ సారి అధికారంలోకి తీసుకొని వచ్చి సోనియమ్మ రుణం తీర్చుకోవాలి అని కోరారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల కృష్ణ,మాజి అధ్యక్షుడు సిద్ధం తిరుపతి,యంపిటిసిలు పార్వతి మల్లేష్, మెరుగు పద్మశంకర్, ఆదివాసీ నాయకులు కనకరాజు,ఉప సర్పంచ్ కనుకుల రాకేష్, ఓరియంట్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుల అధ్యక్షుడు అన్నం కుమార్,యస్ సి సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, సీనియర్ నాయకులు ఏనుగు జనార్ధన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు షాకీర్,మైదం రమేష్,గాదం గట్టయ్య, జంగిలి రమేష్, మహేష్,వార్డు సభ్యులు కొత్త రమేష్,పంబాల తిరుపతి,మల్లెత్తుల రాజేశం , జయరాం, పుర్రె పోషం, విజయ్,ప్రేమ్ లు పాల్గొన్నారు

# మైదంబండ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీ ఎన్నిక

**కమాన్ పూర్**



ముత్తారంమండలంలోని మైదంబండ గ్రామంలో ఏఐసీసీ కార్యదర్శి మాజీ మంత్రి వర్యులు మంథని శాసనసభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నూతన కాంగ్రెస్ కమిటీని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ అధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బుడిది శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పిట్టల రామస్వామి, ప్రధాన కార్యదర్శి పందుల భాస్కర్, కోశాధికారి పిల్లి మల్లేష్, యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బియ్యని శివకుమార్ అధ్వర్యంలో యువజన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గసిగంటి సాగర్, ఉపాధ్యక్షులు కలవేన కుమార్, ప్రధాన కార్యదర్శి కోంక్క విష్ణు,బిసి సెల్ అధ్యక్షుడిగా ఎర్రం సంతోష్, ఉపాధ్యక్షులు ఎర్రం సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎడవేన సంపత్ అధ్వర్యంలో ఎస్సీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బుడిది మహేష్, ఉపాధ్యక్షుడిగా దార శంకర్, ప్రధాన కార్యదర్శి కండె సదయ్య, కిసాన్ సెల్ గ్రామ శాఖ అధ్యక్షులు గోగు మల్లయ్య, ఉపాధ్యక్షులు పందుల సదానందం లను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు వాజీద్ పాషా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బక్కతట్ల కుమార్ ముత్తారం మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ కోలా విజయ్ తదితరులు పాల్గొన్నారు


# వైకాపా నేతపై వైకాపా కార్యకర్తల ఫిర్యాదు

**మైలవరం**

వైసీపీ యువజన విభాగం నాయకుడు నల్లమోతు మధుబాబు పై వైసీపీ నాయకులు ఫిర్యాదు చేసారు. నియోజకవర్గ వ్యాప్తంగా మైలవరం, ఇబ్రహీంపట్నం,జి.కొండూరు పోలీస్ స్టేషన్లలో వైసీపీ పార్టీ మరియు ఎమ్మెల్యే అభిమానులు పిర్యాదు చేసారు. ఎమ్మెల్యే పై రెండురోజుల క్రితం అనుచిత వ్యాఖ్యలు చేసిన నల్లమోతు మధుబాబు పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. జోగి రమేష్ వర్గానికి చెందిన వ్యక్తిగా పేరు బడిన నల్లమోతు మధుబాబు. రెండు రోజుల క్రితం బూడిద లారీలను అడ్డుకుని వసంత కృష్ణ ప్రసాదు బావమరిది తరలిస్తున్నాడంటూ ఎమ్మెల్యే ని అసభ్య పదజాలంతో మధుబాబు దూషించారు. వీడియో వైరల్ అవుతుండడంతో ఆగ్రహానికి గురైన వసంత కృష్ణ ప్రసాదు అభిమానులు, చర్యలు తీసుకోవాలంటూ నియోజకవర్గ వ్యాప్తంగా ఫిర్యాదులు ఇచ్చారు.

## చేర్యాల సిఐ సస్పెండ్

**సిద్దిపేట**



సిద్దిపేట జిల్లా చేర్యాల సిఐ శ్రీనివాస్ ని సిద్దిపేట సీపీ శ్వేతా రెడ్డి సస్పెండ్ చేసారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినదుకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. కొద్దిరోజుల క్రితం చేర్యాల జడ్పీటీసీ మల్లేశం హత్య జరిగిన రోజు సిఐ శ్రీనివాస్ అందుబాటులో లేరు.అదే రోజు చేర్యాల పోలీస్ స్టేషన్లో దాదాపు గంటన్నరకు పైగా సిఐ ఎ రాక కోసం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి చేసారు. అందుబాటులో లేకపోవడంతో గతంలోఉన్నతాధికారులు మెమో జారీ చేసారు. అయినా న తీరు మార్చుకోకుండా గత నెల 24న ఉన్నతాధికారుల అనుమతి లేకుండాసిఐ పొరుగు ప్రాంతానికి వెళ్లినట్లుసమాచారం. తిరుగు ప్రయాణంలో యాక్సిడెంట్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సిఐ మార్చుకొకపోవడంతో సిద్దిపేట సీపీ సస్పెండ్ చేసారు. చేర్యాల సిఐ గా బాధ్యతలు చేపట్టి 9 నెలల్లోనే అయన సస్పెండ్ కి గురైయారు.

## ఆదాని కుంభకోణం పై విచారణ జరపాలి




**హైదరాబాద్**

అబిడ్స్ గన్ ఫౌండ్రి ఎస్ బి ఐ ప్రధాన కార్యాలయం ముందు ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ పిలుపు మేరకు.ఆందోళన దిగారు. ఆదాని కుంభకోణం పై విచారణ జరపాలని డిమాండ్ చేసారు. ఆదాని ని అరెస్టు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సింగూరు టోల్ గేట్ దగ్గర స్థానికుల ధర్నా

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాచౌటకుర్ (మం) సింగూరు చౌరస్తాలోని టోల్ గేట్ దగ్గర స్థానికులు భారీ ధర్నాకు దిగారు. స్థానికుల వాహనాలకు టోల్ టికెట్ చార్జీ 10 రూపాయలు విధించడంతో ధర్నా చేసారు. వెంటనే టోల్ చార్జీలు ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేసారు. లోకల్ వారికి ఫ్రీ పాసులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. చుట్టూ పక్కల గ్రామాలకు వెళ్లడానికి అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మించాలని డిమాండ్ చేసారు.

## అంగలన్వాడి ల అందోళన

**విశాఖపట్నం**

అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని ఏపీ అంగన్వా డి వర్కర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ డిమాండ్ చేసింది.తమ డిమాండ్ల సాధన కోసం విశాఖ నగరంలో జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు.ఈ సందర్భంగా అంగ న్వాడీలు మాట్లాడుతూ అంగన్వాడీ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తుంచకుం డా విపరీతమైన పని భారం మోపడం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో తమను ప్రభు త్వ ఉద్యోగులుగా గుర్తించా లని,సర్వీస్ లో ఉండి చనిపోయిన ఒకరికి ఉద్యోగం ఇప్పించాలనీ, రిటై ర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలనీ, గ్రాడ్యు టి కల్పించాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అంతే కాకుం డా అంగన్వాడీలకు సీనియార్టీ బట్టి ప్రమోషన్ ఇవ్వా లనీ, సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ కోరారు.

## జిల్లా పోలీసుల స్పందన కు 69 అర్జీలు

**నంద్యాల**

స్పందన ఫిర్యాదులకు చట్ట పరిధిలో సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ఎస్పీ. కె.రఘువీర్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి 69 ఫిర్యాదులు వచ్చాయన్నారు .ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు .చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ,స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ,స్పందన పిర్యదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు ,అత్తరింటి వేదింపులు మొదలగు ఫిర్యాదులు ఉన్నాయన్నారు .

# కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త

**నాలుగు శాతం పెరగనున్న డీఏ!**

**జనవరి నుంచే అమల్లోకి**

**న్యూ ఢిల్లీ**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పేందుకు కేంద్రం సిద్ధమైంది. 38 శాతంగా ఉన్న డీఏను నాలుగు శాతం పెంచి 42 శాతం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకునే ఈ నిర్ణయం వల్ల కోటిమందికిపైగా ఉద్యోగులు, పెన్షన్దారులకు లబ్ధి చేకూరనుంది. వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ-ఐడబ్ల్యూ) ఆధారంగా డీఏను సవరిస్తారు. ఇందులో భాగంగా గతేడాది డిసెంబరు నెలకు గాను సవరించిన సీపీఐ-ఐడబ్ల్యూను జనవరి 31న విడుదల చేశారు. ఇందులో డీఏను 4.23 శాతం పాయింట్లు పెంచాలని నిర్ణయించారు. అయితే, కేంద్రం దశాంశ స్థానాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదు కాబట్టి నాలుగు శాతం పెంచే అవకాశం ఉంది. కేంద్రం చివరిసారి గతేడాది సెప్టెంబరు 28న డీఏను పెంచి అదే ఏడాది జులై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. కాగా, కేంద్రం ప్రతి సంవత్సరం రెండుసార్లు డీఏను సవరిస్తుంది. డీఏ పెంపు ప్రతిపాదనను ఆమోదం కోసం కేంద్ర మంత్రి వర్గం ఎదుట ఉంచుతారు. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే పెంపు ఉంటుంది. డీఏ పెంపు జనవరి ఒకటి నుంచే అమల్లోకి రానుంది.

# వైసీపీ కీలక నేత వైబోగుల శ్రీనివాస్ రాజీనామా

**అమరావతి/కాకినాడ**

వైసీపీలో గత నెలరోజులుగా జరుగుతున్న పరిణామాలు పార్టీ పెద్దలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఒకరి తర్వాత ఒకరు ఎమ్మెల్యేలు అసంతృప్తి గళం వినిపించడం.. మరోవైపు ద్వితియ శ్రేణి నేతలనుంచి ఎమ్మెల్యేలకు షాక్‌లు వస్తుండటంతో అసలు అధికార పార్టీలో ఏం జరుగుతోందో అధిష్టానానికి అర్థం కాని పరిస్థితి. నిన్న, మొన్నటి వరకు ఎమ్మెల్యేలు రెబల్స్‌గానే మారారు అనుకుంటే ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్యేల రైట్ హ్యాండ్‌గా చెప్పుకునే ప్రధాన అనుచరులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రాజీనామా చేసేస్తున్నారు. ఇప్పటికే పలువురు నేతలు రాజీనామా చేసి పార్టీ నుంచి బయటికొచ్చేయగా.. తాజాగా కాకినాడకు చెందిన ఓ కీలక నేత వైసీపీకి రాజీనామా చేశారు.జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు ముఖ్య అనుచరుడు షాకిచ్చారు. ఎమ్మెల్యేకు రైట్ హ్యాండ్‌గా, ప్రధాన అనుచరుడిగా ఉన్న వైబోగుల శ్రీనివాస్ వైసీపీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే సొంత మండలమైన జగ్గంపేటలోనే టీడీపీ నేతలు జ్యోతుల నెహ్రూ జ్యోతుల నవీన్ కుమార్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు పలువురు ద్వితియశ్రేణి వైసీపీ నేతలు టీడీపీ కండువా కప్పుకున్నారు. యాదవ సంఘం అంతా చంద్రబాబుకు ఉంటుందని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. అయితే నియోజకవర్గంలో శ్రీనివాస్ కీలకంగా వ్యవహరించేవారని.. చంటిబాబు గెలుపులో ప్రధాన పాత్ర పోషించారని స్థానిక నేతలు చెబుతున్నారు. నియోజకవర్గంలో కీలక నేత అయిన వైబోగుల పార్టీని వీడటం ఎమ్మెల్యేకు గట్టి షాకేనని.. రానున్న ఎన్నికల్లో ప్రభావమేంటో తెలుస్తుందని కొందరు నేతలు చెప్పుకుంటున్నారు. ఇదే కాకినాడలో గొల్లప్రోలు మండలం కొడవలిలో మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో భారీగానే చేరికలు జరిగాయి. సుమారుగా వైసీపీకి చెందిన 50 మంది ముఖ్య కార్యకర్తలు జఅఖకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరారు.

# గంజి కుంట ఫౌండేషన్ సేవలను స్ఫూర్తి గా తీసుకోవాలి

**కడప**



గంజికుంట ఫౌండేషన్ సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తి గా తీసుకోవాలని వైయస్ ఆర్ సిపి రాష్ట్ర ఉమెన్ వెల్ఫేర్ డెవలప్మెంట్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల పాలెం పాపయ్య వీధిలో ఉన్న గంజి కుంట ఫౌండేషన్ కార్యాలయంలో ఆ సంస్థ ఏర్పాటు చేసిన గంజి కుంట బుక్ బ్యాంక్ ను సందర్శించి వీరతొగట క్షత్రియ చే రూపొందించిన క్యాలెండర్ ను ఆమె ఆవిష్కరించారు అనంతరం బుట్టా రేణుక మీడియాతో మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, ప్రతి మనిషి పది మంది కి మేలు చేసినప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందని చెప్పారు పేదవాడికి ఉపయోగ పడే ఫౌండేషన్ కు తమ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు అనంతరం ఫౌండేషన్ చైర్మన్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ను వీవర్స్ డెవలప్మెంట్ కోసం 2015 లో ఏర్పాటు చేశామన్నారు గంజి కుంట బుక్ బ్యాంక్,మ్యాట్రిమని, హెల్ఫేజ్ లాంటి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు ప్రతి సంవత్సరం సమాజం లోని చేనేత పేద ఇంజినీరింగ్ విద్యార్థులకు టెస్ట్ బుక్కులు ప్రతి సెమిస్టర్ కు అందజేయడం జరుగుతుందని తెలిపారు తమ జాతి మేలు కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు అనంతరం బుట్టా రేణుక దంపతులను ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమం లో బుట్టా రేణుక భర్త నీల కంఠం, ఫౌండేషన్ కార్యదర్శి గంజి కుంట గణేష్, సభ్యులు అంబటి కిరణ్మయి, డాక్టర్ తిరుమల రావు, ప్రభాకర్,అమర కుమార్, వంశీ కృష్ణ,తొగట వీర క్షత్రియ సంఘం ఉమ్మడి శెట్టి సుబ్రహ్మణ్యం, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి గునిశెట్టి సాయి కుమార్, బీసీ సంఘం ఈశ్వరయ్య, పద్మప్రియ చంద్రారెడ్డి, మురళి, వంశీ,శశి,శివ,పిఆర్టియు రామకృష్ణ,పుత్రా శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బడ్జెట్ రూ.2,90,396 కోట్లు

**రెవెన్యూ వ్యయం రూ.2,11,685 కోట్లు**

**మూలధన వ్యయం రూ.35,525 కోట్లు**

**బడ్జెట్‌లో ఊసేలేని ఎన్నికల హామీల పథకాలు**

**హైదరాబాద్ :**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనాయి. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి నేడు ప్రవేశపెట్టినున్న బడ్జెట్ ప్రతులను హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు.తెలంగాణ శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి నేడు ప్రవేశపెట్టినున్న బడ్జెట్ ప్రతులను ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు అందజేశారు. వేముల ప్రశాంత్ రెడ్డి, స్పెషల్ సీఎస్ రామకృష్ణ రావు తదితరులు పోచారంను కలిసిన వారిలో ఉన్నారు.బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని.. బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఉంటుందని హరీష్ రావు తెలిపారు. కేంద్రం సహకరించక పోయినా.. ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. తెలంగాణ బడ్జెట్ దేశానికి మోడల్‌గా నిలుస్తుందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.అనంతరం
అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి హరీష్ బడ్జెట్?ను ప్రవేశపెట్టారు.
బడ్జెట్?లో..దళిత బంధుకు భారీగా నిధులు కేటాయించారు.
పేదలకు సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణం కోసం రూ.3లక్షల సాయం
ప్రతి నియోజకవర్గంలో 1,100 మందికి దళితబంధు
కొత్తగా మరో 100 బస్తీ దవాఖానాలు ఏర్పాటు
ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు
బడ్జెట్‌లో ఊసేలేని నిరుద్యోగుల భృతి హామీ
ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త ఈహెచ్ఎస్ విధానం
ప్రతి నియోజకవర్గంలో 1,100 మందికి దళితబంధు
ఈ ఏడాది 60 జూనియర్, సీనియర్, జిల్లా జడ్జిల కోర్టులు ఏర్పాటు



ఏప్రిల్ నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
ఏప్రిల్ నుంచి సెర్ప్ ఉద్యోగులకు పే స్కేలు సవరణ
మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం రూ.3వేలకు పెంపు
ప్రభుత్వ ప్రకటనలకు రూ.వెయ్యి కోట్లు
మెట్రో రైల్ ప్రాజెక్ట్ కోసం రూ.1,500 కోట్లు
ఎయిర్‌పోర్టు మెట్రో కనెక్టివిటీ కోసం రూ.500 కోట్లు
ఓల్డ్ సిటీ మెట్రో కనెక్టివిటీ కోసం రూ.500 కోట్లు
యాదాద్రి ఆలయ అభివృద్ధికి రూ.500 కోట్లు
మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.200 కోట్లు
మహిళా వర్సిటీకి రూ.100 కోట్లు
విద్యా రంగానికి రూ.19,093 కోట్లు
కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌కు రూ.200 కోట్లు
పల్లె, పట్టణ ప్రగతికి రూ.4,834 కోట్లు
డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.12వేల కోట్లు
ఆరోగ్యశ్రీకి రూ.14,063 కోట్లు
పంచాయతీ రాజ్‌కు రూ.31,426 కోట్లు
రుణమాఫీకి రూ.6,385 కోట్లు
షెడ్యూల్ కులాల ప్రత్యేక ప్రగతి నిధికి రూ,.36,750 కోట్లు
మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.2,131 కోట్లు
గ్రామీణ రోడ్లకు రూ.2 వేల కోట్లు
హరితహారం పథకానికి రూ.1,471 కోట్లు
పురపాలక శాఖకు రూ.11,372 కోట్లు
రోడ్లు, భవనాల శాఖకు రూ.2,500 కోట్లు
పరిశ్రమల శాఖకు రూ.4,037 కోట్లు
హోంశాఖకు రూ.9,599 కోట్లు
మైనార్టీ సంక్షేమానికి రూ.2,200 కోట్లు
రైతు బీమా పథకానికి రూ.1,589 కోట్లు
రైతు బంధు పథకానికి రూ.1,575 కోట్లు
వైద్యారోగ్య శాఖకు రూ.12,161 కోట్లు
వ్యవసాయ శాఖకు రూ.26,831
గిరిజన సంక్షేమం, ప్రభుత్వ ప్రత్యేక ప్రగతి నిధికి రూ.15,223 కోట్లు
నీటి పారుదల రంగానికి రూ.26,885 కోట్లు
కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు రూ.3,210 కోట్లు
ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3,117 కోట్లు
విద్యుత్ రంగానికి రూ.12,727 కోట్లు
ఆయిల్ ఫామ్‌కు రూ.వెయ్యి కోట్లు
దళిత బంధుకు రూ.17,700 కోట్లు
ఆసరా పెన్షన్లకు రూ.12 వేల కోట్లు
బీసీ సంక్షేమానికి రూ.6,229 కోట్లు

# రైతుల రుణమాఫీ ఎక్కడా- ఈటెల

**హైదరాబాద్ :**

ఆర్థిక మంత్రి హరీశ్ రావు 29 పేజీలో బడ్జెట్ పుస్తకాన్ని గంట నలభై ఐదు నిమిషాలు చదివారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యంగ్యంగా ప్రస్తావించారు. తనకున్న అనుభవం ప్రకారం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత 50 శాతం నిధులు కూడా విడుదల కావడం లేదన్నారు. కొన్ని డిపార్ట్మెంట్స్ కి ముఖ్యంగా సంక్షేమశాఖలకు డబ్బులు విడుదల చేయకుండా మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. ఎమ్మెల్యేలు రఘునందన్ రావు, రాజాసింగ్ , తనకు కొన్ని వందల దరఖాస్తులు వస్తున్నాయని, రుణమాఫీ చేస్తామని మేనిఫెస్టో పెట్టి నాలుగున్నర సంవత్సరాలు అయినా మాఫీ చెయ్యలేదని విమర్శించారు. ఈ బడ్జెట్ లో రుణమాఫీ ప్రస్తావన చెయ్యలేదన్నారు. ఉద్యోగులకు జీతం ఇవ్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ాఇఖీఖ, ఖాం లకు జీతాలు పెంచలేదన్నారు. తెలంగాణలో వీళ్లకు రూ. 3900 ఇస్తుంటే, పక్కన ఉన్న ఏపీలో రూ.10 వేలు ఇస్తున్నారన్నారు. అంగన్ వాడీలకు రూ.1000 ఇస్తున్నారని, ఇప్పుడు 3000 ఇస్తాం అంటున్నారని, ఇదైనా సక్రమంగా ఇవ్వాలని ఈటల డిమాండ్ చేశారు. తెలంగాణ బడ్జెట్ అంకెల గారడి అని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. రుణమాఫీ చెయ్యాలని రైతులు కోరుతున్నారని, ఆ హామీ నెరవేరేదెప్పుడు అని ప్రశ్నించారు. "కేసీఆర్ కిట్ పిల్లలు పుట్టాక ఇస్తున్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ లో క్లాస్ రూంలు తప్ప మౌలిక సదుపాయాలు మెరుగులేదు. ఎల్బీ నగర్ లో వీఎం హోంలో టాయిలెట్ లేక చెంబు పట్టుకొని బయటకి వెళ్తున్నారు అని పత్రికల్లో వార్తలు రావడం బాధాకరం. ఆరోగ్య శ్రీ, ఇఉూ డబ్బులు రాక ప్రైవేట్ హాస్పిటల్స్ లో వైద్యం అందడం లేదు. కాంట్రాక్టర్స్ కి డబ్బులు లేవు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆ ఘనత ఒక్క తెలంగాణలోనే ఉంది. రిటైర్డ్ ఉద్యోగులు పిల్లల పెళ్లిళ్ల కోసం పెట్టుకున్న జీపీఎఫ్ ఇవ్వడం లేదు. గొప్ప అభివృద్ధి అని చెప్తున్న మీరు బెల్ట్ షాపులు, లిక్కర్ షాపులు వల్ల ఎంత ఆదాయం పెరిగిందో కూడా చెప్పాల్సింది. మీ ఆదాయం దీనితోనే కదా పెరిగింది. కాంట్రాక్టర్స్ కి డబ్బులు సమయానికి ఇవ్వండి. సర్పంచ్ లకు బిల్లులు చెల్లించండి. జీతాలు మొదటి తారీఖున ఇవ్వండి. మీ బడ్జెట్ విని ప్రజలు ముక్కు విరుస్తున్నారు. చెప్పేది గొప్ప.. చేసేది సున్నా" - ఈటల రాజేందర్ బాసర ట్రిపుల్ ఐటీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురుకులలో సరైన వసతులు లేవని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మన ఊరు-మన బడి కేవలం చెప్పడానికే రంగురంగులుగా కనిపిస్తుందన్నారు. ఈహెచ్ఎస్ పేరుతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స ఇవ్వలేమంటున్నారన్నారు. ఆసుపత్రిలలో మందులు కూడా అందడం లేదని విమర్శించారు. విద్యా వాలంటరీలకు, విదేశీ విద్యకు వెళ్లే వారికి సరైన సమయానికి డబ్బు ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్‌లకు టైంకు బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు.

# సీబీఐ విచారణకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ :**

తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. సింగల్ బెంచ్ ఇచ్చిన జడ్జిమెంట్ ను సమర్థించిన డివిజన్ బెంఛ్.. ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సీబీఐతో దర్యాప్తు చేపించాలని ఆదేశాలు ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఇప్పటికే పలు ట్విస్ట్‌లు చోటుచేసుకున్న ఎమ్మెల్యేల కొనుగోలు కేసుపై ఏం జరుగుతుందనే ఉత్కంఠ అందరిలో ఏర్పడింది. సీబీఐతో విచారణకు గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ ఆదేశాలపై తెలంగాణ సర్కార్.. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు.. సీబీఐ విచారణకే మొగ్గు చూపింది. ఈ కేసులో జనవరి 18న చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తీర్పును రిజర్వ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు వెళ్లేందుకు అడ్వకేట్ జనరల్ కొంత సమయం అడిగారు. అప్పటి వరకు ఆర్డర్ సస్పెండ్ లో ఉంచాలని కోరారు. అయితే ఆర్డర్ సస్పెన్షన్ కు హైకోర్టు నిరాకరించింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ఎటువంటి మనీలాండరింగ్ జరగనప్పటికీ ఈడీ కేసు నమోదు చేయడం చెల్లదని ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌కు సమాధానం ఇవ్వడానికి సమయం ఇవ్వాలని రోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాది హైకోర్టుకు విజ్ఞప్తి చేయడంతో.. విచారణ ఫిబ్రవరి 20కి వాయిదా వేసింది.కాగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. మోయినాబాద్ లోని ఓ ఫామ్ హౌస్ లో కొందరు వ్యక్తులు.. తమను ప్రలోభపెట్టారన్న వ్యాఖ్యలు కలకలం రేపాయి. డబ్బు ఆశ చూపారని, పార్టీ మారేందుకు ఒత్తిడి చేశారని వివరించారు. దీంతో ఈ కేసు పలు మలుపులు తిరుగుతోంది. ప్రస్తుతం సీబీఐ విచారణకు హైకోర్టు అనుమతి పొందింది.అయితే, ఈ విషయంపై తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని కాబట్టి, ఆర్డర్ ను సస్పెన్షన్‌లో ఉంచాలని ప్రభుత్వం తరపు న్యాయవాది ద్విసభ్య ధర్మాసనాన్ని కోరారు. అందుకు న్యాయమూర్తులు నిరాకరించారు.

మాకేమి భయం లేదు- గువ్వల బాలరాజు ఎమ్మెల్యేల ఎర కేసులో సీబీఐ విచారణకు సహకరిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల ప్రలోభాల కేసులో సీబీఐ దర్యాప్తును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కేసీఆర్ ప్రభుత్వం సవాల్ చేసింది. ఈ అంశంపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇవాళ తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలపై అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడారు.ఎమ్మెల్యే ప్రలోభాల కేసును సీబీఐ విచారిస్తే ఎందుకు భయపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను, ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని దర్యాప్తు సంస్థలను ఆయన కోరారు.

# దమ్ముంటే పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేయండి

**ఖమ్మం**

ఆత్మీయ సమ్మేళనాలతో కాక రేపుతోన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి. మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఘాటు వ్యాఖ్యలు చేసిన పొంగులేటి.. ఈసారి బీఆర్ఎస్ హైకమాండ్‌ను టార్గెట్ చేశారు. మీ గెలుపు కోసం నన్ను ప్రాధేయపడిన సంగతి మర్చిపోయారా..? అంటూ నిప్పులు చెరిగారు. నాకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉందా అని అడుగుతున్నారు.. ఉందోలేదో బీఆర్ఎస్సే చెప్పాలన్నారు పొంగులేటి. తన అనుచరులు కొందరిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లను, వీళ్లను సస్పెండ్ చేయడం కాదని.. దమ్ముంటే తనను సస్పెండ్ చేయాలని సవాల్ విసిరారు. తనను కొద్దిరోజుల క్రితం వరకు పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించారని ఆయన గుర్తు చేశారు. తనకు పార్టీ సభ్యత్వంలేనప్పుడు డిసెంబర్ వరకు పార్టీ కార్యక్రమాల్లో తన ఫోటో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. తనను నమ్ముకున్న అభిమానుల నిర్ణయం మేరకే పార్టీ మార్పు ఉంటుందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.కాకుల్లా, గద్దల్లా పొడిచినా.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. నేను ఒక్కడినే అనుకోవడం.. అది మీ అవివేకం అంటూ హెచ్చరించారు. సందర్భం వచ్చినప్పుడు.. అన్నిటికీ సమాధానం చెబుతానని అన్నారు. నేను పార్టీ మారే విషయంలో మీ అందరికీ ఉత్కంఠ ఉందన్నారు. కొందరు కాంగ్రెస్ అని.. అమిత్ షాను కలుస్తున్నాని.. షర్మిల పార్టీ అని ప్రచారం చేస్తున్నారని.. ఇందంతా నా అనుచరులు, అభిమానుల నిర్ణయం మేరకు తాను పార్టీ మారడం ఉంటుందని స్పష్టం చేశారు. నా ప్రజలు, అభిమానులు నిర్ణయించిన, నాకు నచ్చిన రోజు మంచి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఎవరో రెచ్చగొడితే?ఇబ్బందులు పెడతారనీ.. నిర్ణయం తీసుకునే ప్రసక్తే లేదన్నారు.కొందరు నేతల ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగి మా కార్య కర్తలను ఇబ్బందులు పెడితే.. అధికారం ఎవడి అబ్బ సొత్తు కాదంటూ అధికారులను హెచ్చరించారు. భవిష్యత్‌లో వడ్డీ కాదు చక్రవడ్డీతో సహా చెల్లిస్తానన్నారు. మా నేతల్ని బెదిరిస్తున్నారు.. అది మంచి పద్ధతి కాదన్నారు.

## ట్రాఫిక్ నింధలపై అవగాహన

**మదనపల్లె**

జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా వేయడం జరుగుతుందని ట్రాఫిక్ ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండు వద్ద ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు. సరైన రికార్డులు లేని వాహనాలను సీజ్ చేయడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించడం, మైనర్లు డ్రైవింగ్ చేస్తుంటే వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడం చేస్తున్నామని వివరించారు.

## హెయిర్ డోనేషన్

**మదనపల్లె**

క్యాన్సర్ భాదితుల మోహాల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. నేడు మదనపల్లెకు చెందిన విజయలక్ష్మి, నాగరాజుల కుమార్తె రిషిత హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి స్వచ్ఛందంగా తన కేశాలను దానం చేశారు. వీరికి హెల్పింగ్ మైండ్స్ సభ్యులు పూల మొక్కను ఇచ్చి అభినందించారు.

## మున్సిపల్ స్పందన కు 4 అర్జీలు

**నంద్యాల**

వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందన ద్వారా ప్రజల నుంచి అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వి. ఎస్ ఎన్. ఎమ్ మూర్తి . సిబ్బందిని ఆదేశించారు . పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణంలో ఉన్న ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. వివిధ అంశాలపై 4.ఆర్జీలు అందాయని వి. ఎస్ ఎన్ ఎమ్ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఈ రమణమూర్తి. ఆర్ ఓ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ రంగానికి పెద్దపీట

**జగిత్యాల,**

దళితుల అభ్యున్నతికి తొలి ప్రాధాన్యమిస్తూనే బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి 2023-24బడ్జెట్ లో తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసింది.వ్యవసాయానికి తోడ్పాటును కొనసాగిస్తూనే అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పనకు అండగా నిలిచింది.అత్యధిక కుటుంబాలకు పథకాల ద్వారా చేరువయ్యేలా బడ్జెట్ ను రూపొందించడం హర్షణీయం.దళిత బంధు కోసం రూ.17,700 కోట్లు,బీసీ సంక్షేమము కోసం రూ.6,229 కోట్లు,మైనారిటీ సంక్షేమం కోసం రూ.2200 కోట్లు,గిరిజన సంక్షేమం కోసం ,ప్రత్యేక ప్రగతి నిధికి రూ.15,223 కోట్లు,ఆసరా పెన్షనర్లు కోసం రూ.12 వేల కోట్లు,కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ పథకాలకు రూ.3,210 కోట్లు,నిరుద్యోగుల కోసం ఉద్యోగుల నియామకాల్లో అటెండర్ నుంచి ఆర్డీవో దాకా స్థానికులకే ఉద్యోగాల కల్పన, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ,వంటి అంశాలతో కూడిన ఈ సంక్షేమ బడ్జెట్ ఉంది.తెలంగాణ ఆచరిస్తుంది..దేశం అనుసరిస్తుంది అన్న స్థాయిలో రాష్ట్రం దూసుకుపోతుంది.

## ఏసీబీ వలలో ఆర్ఐ

**మెదక్**

లంచం తీసుకుంటున్న సమయంలో చిన్న శంకరంపేట మండలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీహరిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రైతు పొలం విషయంలో లంచం తీసుకుండగా రెడ్ హండెడ్ గా గా పట్టుకున్నారు. 8000 రూ, లంచం తీసుకుంటూ ఆర్ఐ దొరికిపోయాడు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**జగిత్యాల,**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష సంబంధిత అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 33. ఫిర్యాదులు, వినతులు వచ్చాయిని అధికారులు తెలిపారు..ఆనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో జిల్లా అదునపు కలెక్టర్లు బిఎస్ లత, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# డంప్ యార్డు కాలుష్యంతో ఎముకల గూళ్ళగా మారుతున్న ప్రజలు

**మేడ్చల్ నియోజకవర్గం బిజెపి నేత కొంపల్లి మోహన్ రెడ్డి ఆందోళన సమస్య పరిష్కారానికి పోస్ట్ కార్డు ఉద్యమానికి పిలుపు**



**మేడ్చల్ :**

మేడ్చల్ నియోజకవర్గం లోని జవహర్ నగర్ డంప్ యార్డు కాలుష్యం మూలంగా డంప్ యార్డు పరిసర ప్రాంతాలలోని ప్రజల బ్రతుకులు ఎముకల గూళ్ళగా మారుతున్నాయని మేడ్చల్ నియోజకవర్గం బిజెపి నేత కొంపల్లి మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేసారు. ఈ మేరకు జవహర్ నగర్ డంప్ యార్డు కాలుష్యం బారిన పడుతున్న దమ్మాయిగూడ పట్టణ ప్రజానీకానికి ఆయన భహిరంగ లేఖ రాసారు. అనేక ఏళ్లుగా పాలకులుగా ఉంటున్నవారు కండువాలు మార్చి బోగా, భాగ్యాలు, అనుభవిస్తున్నారు కానీ వారికి ప్రజల ద్వారనే ఆ పదవులు,వచ్చాయి అనే కనీస ఇంగితజ్ఞానం లేకుండా ఒక్కో సమస్యను తరాల తరబడి నాన్చుతూ ఉండడంవల్ల ఈ ప్రాంతంలో నివసించే మీ' అందరి జీవితం అన్ని రకాల కాలుష్యాలతో సావాసం చేస్తూ శరీరంలో ఉన్న అన్ని అవయవాలకు దీర్ఘ కాలిక వ్యాధులు సంభవిస్తూ ఈ జీవితాలు ఎముకల గూళ్ళ లాగా తయారవు తున్నాయని పేర్కొన్నారు.

ఈ విషయం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉంది,ఈ దుర్భర జీవితాన్ని మార్చడంలో శాసనవ్యవస్థ ఎమ్మేల్యేలు - మరియు కార్యనిర్వాహక వ్యవస్థ (అధికారులు) నిర్ణయాలు తీసుకొని మీ జీవితాలలో వెలుగులు నింపే విషయంలో పాలసీ పెరాలసిస్ (నిర్ణయాల అమలులో పక్షవాతం)లా ఈ డంప్ యార్డు వల్ల ఏర్పడే కాలుష్య సమస్యలకు పరష్కారం లభించడం లేదని మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

నేను ఈ సమస్యపై మా బిజెపి పార్టీ పక్షాన దశాబ్దాలుగా అనేక ప్రజా పోరాటాలు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో మీ'జీవన ఘోషను వినిపించి డంప్ యార్డును ఎత్తివేసే దిశగా ఉత్తర్వులు తెచ్చినా.. పాలకుడికి ప్రజల కన్నా పరాయి పెట్టుబడిదారుల ప్రయోజనాలే ముఖ్యం అయినాయని పేర్కొన్నారు.ఇక ఈ సమస్యను చెడుపై మంచి గెలిచిన నరకాసుర సంహారం చేసిన విధంగా గెలిచి మీ' జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలి అంటే ప్రజాస్వామ్యంలో 4 స్థంభాల్లాంటి రెండు వ్యవస్థలు శాసనవ్యవస్థ (ఎమ్మేల్యేలు) మరియు కార్యనిర్వహక వ్యవస్థ (అధికారులు) విఫలం అయినా!! మిగిలిన 2 వ్యవస్థలు న్యాయ వ్యవస్థ మరియు పాత్రికేయ వ్యవస్థ ఇప్పటికీ క్రియాశీలకంగా ఉంటూ ప్రజల పక్షాన నిలుస్తున్నాయి కాబట్టి..!మీ సమస్యలను ఆ రెండు వ్యవస్థల గుండెను చేరి అంతిమ విజయం సాధించేలా మీ మున్సిపాలిటిలోని ప్రతీ పౌరుడు కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గోడును రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గారికి ఉత్తరాల ద్వారా తెలియజేసే కార్యక్రమాన్ని చేపడదామని అని మీ అందరితో మనవి చేస్తున్నాని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో దేశం కొరకు వీరోచితంగా పోరాడిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ గారు విశ్వసించిన ఉన్నత ఆశయంతో ఉద్యమిస్తే, అపజయం కూడా దిగ్విజయం అవుతుంది అన్న మాటలే మన ఈ పోస్ట్ కార్డు ఉద్యమానికి కొంపల్లి మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.


# రాజధాని అంశంపై సర్కార్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ :**

ఆంధ్రప్రదేశ్ లో రాజధాని ఇష్యూ.. రోజుకో మలుపు తిరుగుతోంది. మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరతామని అధికార పార్టీ చెబుతుంటే.. అమరావతిని రాజధానిగా ఒప్పుకుని ఇప్పుడు మాట మార్చడమేంటని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నాయి. ఈ విషయం రాష్ట్రంలోనే కాకుండా దేశ రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. చివరకు దేశ సర్వోన్నత న్యాయస్థానం వద్దకు చేరింది. ఏపీ రాజధాని అమరావతిపై దాఖలైన పిటిషన్ల విచారణ అంశం సుప్రీంకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. వీటిని త్వరగా విచారించాలని జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ నాగరత్న ధర్మాసనం వద్ద రాష్ట్ర ప్రభుత్వ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి ప్రస్తావించారు. వీటిపై అమరావతి ప్రాంత రైతులు, ఇతర ప్రతివాదుల తరఫు న్యాయవాదులు స్పందించారు. ఈ కేసులో తమకు న్యాయస్థానం ఇచ్చిన నోటీసులు జనవరి 27న అందాయని తెలిపారు.ఇరుపక్షాలు ప్రస్తావించిన అంశాలపై చర్చించిన అనంతరం.. ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 23కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ నాగరత్న ధర్మాసనం స్పష్టం చేసింది.. నాడు కేసు విచారణను జనవరి 31కి వాయిదా వేశారు. కానీ ఆరోజు విచారణకు రాలేదు. అప్పటివరకు ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రభుత్వం కూడా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. కాగా.. గతంలో ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో సంచలనంగా మారాయి.

# సంక్షేమంపై లాభనష్టాలు ఉండవు

**హైదరాబాద్ :**



ఉచితాలను అవహేళన చేస్తున్న టైంలో ప్రజల కన్నీరు తుడిచేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు తెలంగాణ ఆర్థిక మంత్రి హరీశ్ రావు తెలిపారు. ప్రతిదాన్నీ లాభనష్టాలతో చూసేందుకు పరిపాలన వ్యాపారం కాదన్నారు. సంక్షేమ పథకాలను లాభనష్టాల దృక్పథంతో కాకుండా మానవాభివృద్ధి దృక్పథంతో చూడాలన్నారు. గత ప్రభుత్వం 200 పింఛన్ ఇచ్చేదని... దాన్ని ఇప్పుడు రూ.2,016 కు పెంచామన్నారు. దివ్యాంగులకు రూ.3,016 ఇస్తున్నామన్నారు. మానిఫెస్టోలో పేర్కొనక పోయినా... ఎవరూ డిమాండ్ చేయక పోయినా బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, ఫైలేరియా బాధితులకు, డయాలసిస్ పేషెంట్లకు 2,016 రూపాయలు పింఛన్ ఇస్తున్నామన్నారు. 2014లో పింఛన్లు పొందే లబ్ధిదారుల సంఖ్య 29,21, 828 ఉండేదని... వీరి కోసం ఏటా రూ.861 కోట్లు ఖర్చు అయ్యేదన్నారు. తెలంగాణ ఏర్పాటు అయ్యాక ఆసరా పింఛన్ లబ్ధిదారుల సంఖ్యను ప్రభుత్వం 44, 12, 882 మందికి పెంచామన్నారు. ఇప్పటి వరకు 54,989 కోట్ల రూపాయలను ఆసరా పింఛన్లు ఇచ్చామన్నారు. గత బడ్జెట్‌లో చెప్పిన విధంగా 57 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇస్తున్నామని మంత్రి హరీశ్ రావు బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఈ మేరకు 2022లో కొత్తగా 8,96,592 మందికి ఆసరా పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఆసరా పింఛన్ల కోసం ఈ బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు ప్రతిపాదించారు మంత్రి హరీశ్ రావు. దళిత బంధుపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. దళిత జాతి స్వశక్తితో, స్వావలంబనతో జీవించాలనే బలమైన సంకల్పంతో ఈ పథకాన్ని తీసుకొచ్చినట్టు వెల్లడించారు. అందుకే ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. షెడ్యూల్ కులాల, తెగల అభివృద్ధికి ప్రత్యేక ప్రగతి నిధి అమలు చేస్తోందని, వారి జనాభాకు సరిపడా కేటాయింపులు చేసినట్టు పేర్కొన్నారు. ఈసారి ఎస్సీల ప్రత్యేక ప్రగతి నిధికి రూ.36,750 కోట్లు ప్రతిపాదిం చామన్నారు. విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు మంత్రి హరీశ్ రావు. తెలంగాణ ఏర్పడే నాటికి ఎస్సీల కోసం రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయాలు 134 ఉంటే... తెలంగాణ ఏర్పడిన తర్వాత 268కు పెంచామన్నారు. వీటిలో చదివే విద్యార్థుల సంఖ్య 1,55, 863కు చేరిందన్నారు. దళితుల గృహావసరాల కోసం 101 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నా మన్నారు. దీని కోసం ఇప్పటి వరకు రూ.251 కోట్ల నిధులు ఖర్చు చేశామని ప్రకటించారు. బడ్జెట్‌లో షెడ్యూల్ తెగల ప్రత్యేక ప్రగతి నిధి కింద రూ.15,233 కోట్లు ప్రతిపాదించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేక పథకాలను రూపొందిం చామన్నారు మంత్రి హరీశ్ రావు. ఇప్పటి వరకు చేపట్టిన పథకాలను, సాధించిన విజయాలను వివరించిన హరీశ్ రావు... ఈసారి బడ్జెట్‌లో రూ.6,229 కోట్లు ప్రతిపాదిస్తున్నట్టు వెల్లడించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కోసం ఈ బడ్జెట్లో రూ.3,210 కోట్ల నిధులు కేటాయి స్తున్నట్టు తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ అందించే రుణాల కోసం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.270 కోట్లు ఖర్చు చేయడానికి ప్రతిపాదించారు. గతేడాది కన్నా రూ.239 కోట్లు ఎక్కువని తెలిపారు. పేద ముస్లిం మహిళలకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 20 వేల కుట్టుమిషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. మొత్తంగా మైనారిటీల సంక్షేమానికి రూ.2,200 కోట్లు ప్రతిపాదించామని మంత్రి హరీశ్ రావు ప్రకటించారు.

## అండర్ పాస్ నిర్మాణంకోసం అందోళన

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం తాడ్దాన్ పల్లి టోల్ ప్లాజా వద్ద పార్టీలకు అతీతంగా స్థానికులు భారీ ధర్నా నిర్వహించారు.ఉమ్మడి పుల్కల్ 23 గ్రామాల ప్రజలు 161 వ జాతీయ రహదారిపై సుమారు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. పుల్కల్ మండలానికి వెళ్ళడానికి తాడ్దాన్ పల్లి టోల్ గేట్ వద్ద అండర్ పాస్ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు.స్థానికుల వాహనాలకు టోల్ గేట్ వారు టికెట్ చార్జి 10 రూపాయలు విధించడం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.వెంటనే టోల్ గేట్ ఛార్జీలు ఉపసంహరించుకావాలని లేని యెడల భారీ ఎత్తున టోల్ గేట్ పై దాడి చేస్తానని హెచ్చరించారు.చుట్టూ పక్కల గ్రామాలకు వెళ్ళడానికి టోల్ గేట్ ఏరియాలో అండర్ పాస్ నిర్మించక పోవడం వల్ల వాహన దారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని వెంటనే అండర్ పాస్ నిర్మించాలని డిమాండ్ చేశారు.లోకల్ ఉండే స్థానికులకు పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు.సుమారు రెండు గంటల పాటు 161 హైవే పై స్థానికులు ఆందోళన చేయడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టారు.అండర్ పాస్ నిర్మించాడనికి సోమవారం వరకు నిర్ణయం తీసుకుంటామని టోల్ గేట్ అధికారులు స్థానికులకు తెలపడంతో ధర్నా విరమించారు..

## మాజీమంత్రి కొల్లు రవీంద్ర అరెస్టు

**మచిలీపట్నం**

కోట్లాది రూపాయాల విలువచేసే ప్రభుత్వ భూమిని వైసీపీ పార్టీ కార్యాలయానికి కేటాయించడాన్ని నిరసిస్తూ కొల్లు రవీంద్ర, కొనకళ్ల బల్లయ్యా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వైసీపీ కార్యాలయ స్థలాన్ని మీడియాకు చూపే ప్రయత్నం కొల్లు రవీంద్ర చేసారు. కొల్లు రవీంద్ర ను అడ్డుకున్న పోలీసులు, బల్లయ్యను అరెస్ట్ చేసారు. పోలీస్ చర్యలనుటీడీపీ నేతలు ప్రతిఘటించారు. కొల్లు రవీంద్ర ను కూడా అరెస్టు చేసి గూడూరు వైపు తరలించారు.

## జూలై 1 న టీపీఎస్సీ 4 గ్రూప్ పరీక్షలు

**హైదరాబాద్**

తెలంగాణ గ్రూప్-4 దరఖాస్తు ప్రక్రియ శుక్రవారం (ఫిబ్రవరి 3) విడుదలైంది. రాష్ట్రంలోని 8,180 టీఎస్పీయస్సీ గ్రూప్ 4 పోస్టులకు దాదాపు 9,51,321 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన ఒక్కో పోస్టుకు 116 మంది పోటీపడుతున్నారు. టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 4కు పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడం ఇది రెండోసారి కావడం గమనార్హం. 2018లో 700 వీఆర్వో పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన రాతపరీక్షకు రికార్డుస్థాయిలో 10.58 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో పోస్టులు తక్కువగా ఉండటంతో ఒక్కో పోస్టుకు సగటున 1511 మంది పోటీపడ్డారు. ఈ సంవత్సరం 8,180 గ్రూప్-4 పోస్టులకు 9,51,321 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గ్రూప్ 4 పోస్టులకు ఈ ఏడాది జులై 1న రెండు పేపర్లకు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల నుంచి 30 నిముషాల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2 గంటల 30 నిముషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్ 2 పరీక్ష నిర్వహించనున్నారు.కాగా 581 వసతిగృహ సంక్షేమాధికారుల పోస్టులకు 1,45,358 మంది దరఖాస్తు చేసుకున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖలో భర్తీ చేయనున్న 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 2930 దరఖాస్తులువచ్చాయి.

## బుగ్గ వంక ఇరువైపుల రక్షణ గోడ నిర్మించాలి

**కడప**

బుగ్గ వంక డ్యాము నుండి చివరి పెన్నా నది వరకు ఇరువైపుల రక్షణ గోడ తక్షణం పూర్తిచేయాలని సిపిఐ టూ టౌన్ జోన్ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఆఫీస్ లో స్పందన కార్యక్రమంలో వినతి పత్రం ఇచ్చారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గు వంక డ్యామ్ నుండి చివరి వరకు ఇరువైపుల రక్షణ గోడకై నిధులు మంజూరు చేసినప్పటికీ అరకొర పనులతో కడప నగరంలోని అల్మాస్పేట వరకు రక్షణ కూడా నిర్మించి వదిలేయడం జరిగిందని వారు అన్నారు అల్మాస్పేట నుండి సాయిపేట, రూకువారిపల్లి ,పాలంపల్లి, బోచంపల్లి మీదుగా వెళ్లే బుగ్గ వంక ఇరువైపులా రక్షణ గోడ నిర్మించకపోవడం బాధాకరమని వారు తెలియజేశారు. గతంలో వర్షాకాలంలో బొగ్గు వంక నీరు పారుదలతో అనేక ఇల్లు కోల్పోవడం మరియు భారీగా పంట నష్టం జరిగిందని వారు గుర్తు చేశారు. బొగ్గు వంక నీరు పారుదలతో అక్కడ ఉన్న పొలాలలో వర్ద నీరు వెళ్లి పంట పొలాలు నీళ్లుతో మునిగి రైతులకు భారీ పంట నష్టం జరిగిందని వాళ్ళు తెలియజేశారు. అదేవిధంగా పాలంపల్లె నుండి వెళ్లడానికి రాకపోకలు కూడా చాలావరకు నీరుపారుదల వల్ల ఆగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని వారు తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి అల్మాస్పేట నుండి చివరి పెన్నా నది వరకు రక్షణ కూడా తక్షణం నిర్మించి బుగ్గ వంక లో ఉన్న చెత్తను తొలగించి వెంటనే రక్షణ గోడ నిర్మాణం మొదలు పెట్టాలని వారు తెలియజేశారు. రక్షణ గోడ నిర్మించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ టూ టౌన్ జోన్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, భద్రయ్య, పకీరప్ప, మేకల జయన్న తదితరులు పాల్గొన్నారు

# ఫిబ్రవరి 10న ఐపిఎల్ గ్రాండ్ రిలీజ్



బీరం వరలక్ష్మి సమర్పణలో, అంకిత మీడియా హౌస్ బ్యానర్ పై విశ్వ కార్తికేయ, శరణ్, అవంతిక, అర్చన గౌతమ్ హీరో హీరోయిన్లుగా, సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో, బీరం శ్రీనివాస్ నిర్మిస్తున్న సినిమా ×ఐపీఎల్×. ఈ సినిమా ఫిబ్రవరి 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా ప్రి రిలీజ్ వేడుక ప్రసాద్ ల్యాబ్స్ గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించింది చిత్ర యూనిట్. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ తో పాటు పలువురు సినీ, వ్యాపార వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ మాట్లాడుతూ..ఈ సినిమా టీమ్ చాలా కష్ట పడ్డారు..ట్రైలర్ టీజర్ చాలా బాగుంది.వేంగి మంచి ట్యూన్స్ ఇచ్చాడు. సినిమా పెద్ద సక్సెస్ కావాలి అన్నారు.

నిర్మాత డి ఎస్ రావు మాట్లాడుతూ; ఈ నిర్మాత బిరం శ్రీనివాసరావు నాకు మంచి మిత్రుడు.ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసినప్పుడు నేను కొన్ని సూచనలు సలహాలు ఇచ్చాను. హీరో విశ్వ కార్తికేయ, హీరో నితిన్ నాష్ ఇద్దరు జేమ్స్.. ఇద్దరి స్క్రీన్ ప్రెజెన్సీ బాగుంది.వాళ్ళు పడిన కష్టం స్క్రీన్ మీద కనపడుతుంది.అలాగే ఈ టీం చాలా కష్ట పడ్డారు..ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవ్వాలి అని కోరుకుంటున్నాను.

ఉదయ భాస్కర్ మాట్లాడుతూ; ఫిబ్రవరి 10న రిలీజ్ అవుతున్న ఈ సినిమా తిజూశ్రీ ఎంత సక్సెస్ అయ్యిందో అంత సక్సెస్ కావాలి అని కోరుకుంటున్నాను. విశ్వకార్తికేయ జాతీయ స్థాయి హీరో అవుతాడు.. నితిన్ నాష్ అద్భుతమైన నటుడు..సినిమా సక్సెస్ కావాలి అని కోరుకుంటున్నాను

విక్రమాదిత్య మాట్లాడుతూ..ఒక మంచి టీమ్ తో వర్క్ చేసాను..సినిమా బాగా వచ్చింది.నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతకు థాంక్స్

నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ; .చిన్న సినిమాలు హిట్ అయినప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది.. ఈ సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలి.. హీరో కార్తికేయ వాళ్ళ నాన్న రామాంజనేయులు నాకు మిత్రులు..కార్తికేయ నుంచి సినిమా సినిమా అంటూ ఎంతో కష్ట పడతాడు.త్వరలోనే మంచి స్టేజ్ కు వెళ్తాడు.ఇంకొక హీరో నితిన్ నాష్ బాగా నటించాడు.అవంతిక తెలుగమ్మాయి. ఆమెకు మంచి అవకాశాలు వస్తాయి..సినిమా మంచి సక్సెస్ అయ్యి నిర్మాతకు డబ్బులు టీమ్ కు మంచి పేరు రావాలి అని కోరుకుంటున్నాను

రచ్చ రవి మాట్లాడుతూ; ఈ సినిమాలో నేను నటించాను ఈ టీం తో మంచి అనుబంధం ఉంది.కొత్తగా వచ్చే నిర్మాతలు సక్సెస్ ధ్యేయంగా కష్ట పడతారు.నిర్మాత ఖర్చుకు వెనుకాడకుండా నిర్మించారు.

నిర్మాత బిరం శ్రీనివాస్ మాట్లాడుతూ: మా సినిమా 10న రిలీజ్ అవుతుంది. మా సినిమాలో నటించిన నటి నటులు టెక్నీషియన్స్ సహకారం తో సినిమా బాగా వచ్చింది.మాకు సహకరించిన ప్రతి ఒక్కరికి థాంక్స్

రాహుల్ సిప్లి గాంజ్ మాట్లాడుతూ: నా లైఫ్ లో అన్న తమ్ముడు లేడు అన్ని వేంగి సుధాకర్ నాకు.అన్ని గైడ్ చేస్తూ ఉంటాడు. నన్ను ఇండస్ట్రీకి పరిచయం చేసింది వేంగి నే..ఈ సినిమా లో ఒక సాంగ్ పాడాను. పాటలు ఎంత హిట్ అయ్యాయి సినిమకూడా పెద్ద హిట్ కావాలి

సంగీత దర్శకుడు వేంగి సుధాకర్ మాట్లాడుతూ: నాకు నిర్మాత దర్శకులు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు.ఏ సింగర్ అనుకుంటే వారిని ఇచ్చారు.సినిమా పాటల కు మంచి ఆదరణ లభించింది.రేపు 10 సినిమా రిలీజ్..మంచి హిట్ కావాలి అని కోరుకుంటున్నాను

దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ: నాకు ఈ అవకాశం మా అమ్మ వల్ల వచ్చింది. ఎన్నో ఒడిదుడుకులు ఎదురుకొని రిలీజ్ కి వచ్చాము.మాకు డి ఎస్ రావు గారు ఫస్ట్ నుంచి మంచి సపోర్ట్ చేశారు.టీమ్ అంతా బాగా కోపరేట్ చేశారు..ప్రతి ఒక్కరికి పేరు పేరున థాంక్స్.హీరోలు ఇద్దరు కూడా ఎంతో హార్డ్ వర్క్ చేస్తారు.మంచి అవుట్ ఫుట్ ఇచ్చారు.సినిమా బాగా వచ్చింది.అందరూ సినిమా చూడండి

హీరోయిన్ అవంతిక మాట్లాడుతూ: నేను తెలుగు అమ్మాయిని . కాకినాడ మాది. .దర్శక నిర్మాతల సహకారం మరువలేను.ప్రతి ఒక్కరు కూడా ఎంతో సపోర్ట్ చేశారు...విశ్వ కార్తికేయ బాల నటుడు గా అందరికి తెలుసు బాగా నటించారు నితిన్ నాష్ కూడా బాగా నటించారు.. సినిమా పెద్ద హిట్ అవుతుందని భావిస్తున్నా

హీరో నితిన్ నాష్ మాట్లాడుతూ: ఏదైతే క్రికెట్ లో ఒక మంచి టీమ్ ఉంటుందో అలాంటి టీం మాది..అందరిలో మంచి ఫైర్ ఉంది.. మాకు కొత్త వారికి అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతకు థాంక్స్. అందరం కలిసి పని చేస్తే 5 సంవత్సరాలలో ఇండియా నెంబర్ వన్ పొజిషన్ లో ఉంటుంది..

హీరో విశ్వ కార్తికేయ మాట్లాడుతూ: ..నేనెప్పుడూ మా అమ్మ నాన్న లకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ఒక మూవీ పూర్తి చేయడం ఒకటాస్క్. అది200 థియేటర్స్ లో రిలీజ్ చేస్తున్నారు అని మంజుల గారితో అన్నాను. ఆవిడ ఏమన్నారు అంటే... కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చి ఒక ప్రయత్నం చేసాము అని ఎంతో పాజిటివ్ గా చెప్పారు.ఈ సినిమాలో పాటలు పెద్ద హిట్ కావడానికి కారణం మ్యూజిక్ డైరెక్టర్ వేంగి. క్రికెట్ ను తీవ్రవాదం న్నీ మిక్స్ చేసి బాగా తెరకెక్కించారు దర్శకుడు సురేష్. మేము జన్యున్ ఎఫర్ట్ పెట్టాము మా ప్రయత్నాన్ని ఆశీర్వదించండి థాంక్స్.

విశ్వ కార్తికేయ, నితిన్ నాష్, అర్చన్ గౌతమ్, అవంతిక, హీరో హీరోయిన్లు....సుమన్, తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణ మురళి, పృధ్వీ రాజ్, డిఎస్ రావు,అమిత్, మిర్చి మాధవి, కిన్నెర,,ఈరోజుల్లో సాయి, రచ్చ రవి, రామ్ ప్రసాద్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.


# ఆర్ నారాయణ మూర్తి యూనివర్సిటీ మూవీ టైటిల్ లోగో ను ఆవిష్కరించిన పద్మశ్రీ బ్రహ్మానందం



ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ...గత 40 సంవత్సరాలుగా సినిమాలు తిస్తున్నాను. యూనివర్సిటీ అనే ఈ సినిమా 30 వ సినిమా నాది...ఒక జ్ఞాని, ఒక ప్రొఫెసర్ అయిన బ్రహ్మానందం గారు ఈ ప్రెస్ మీట్ కు రావాలని విజ్ఞప్తి చేసాను వచ్చారు సంతోషం గా ఉంది. ఎడ్యుకేషన్ మీద ఈ సినిమా తీసాను.విజయనగరం పార్లకిమిడి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ తీసాను. అక్కడ నాకు సహకరించిన మంత్రి బొత్స సత్యన్నారాయణ గారికి మిగతా వారికి నా ధన్యవాదములు..వైజాగ్ సత్యానంద్ మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న స్టూడెంట్స్ ఈ సినిమాలో నటించారు. భారతదేశంలో విద్య వ్యవస్థ వైద్య సంస్థ లు రెండు సేవా రంగాలు అని రాజ్యాంగం చెపుతుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు ఈ రెండు రంగాలను ప్రవేట్ పరంగా కాకుండా ప్రభుత్వమే నిర్వహించేలా ఉండాలి. విద్యార్థులు జాతి సంపద వారిని కుల మాత భేదం లేకుండా ప్రోత్సహించాలి. విద్య ఇప్పుడు ప్రేవేట్ పరం అయిపోతుంది. భారత దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల తో తీసాను. ప్రధాని నరేంద్రమోడీ గారు..సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేట్ పరం చేయకుండా మిరిచ్చిన హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

బ్రహ్మానందం గారు మాట్లాడుతూ: ఆర్ నారాయణమూర్తి గత 35 సంవత్సరాల అప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పటికి అలానే వున్నాడు. స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్ పెట్టి ఎన్నో అద్భుత మైన సినిమాలు నిర్మించారు. ఎప్పుడు సినిమా సినిమా నే ప్రాణం ఆయనకి . కళా దర్శకుకు వున్నారు వ్యాపారాత్మక దర్శకులు వున్నారు కానీ ప్రజా దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి ఒక్కడే. చలన చిత్రం అనే సముద్రం వంక అందరూ చూస్తే ఆ సముద్రం చూసే వ్యక్తి ఆర్ నారాయణ మూర్తి. అరుదైన వ్యక్తి ఆర్ నారాయణ మూర్తి. నారాయణ మూర్తి కి తెలిసింది సినిమానే. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పాటు పడే వ్యక్తి. ఆర్ నారాయణ మూర్తి తో వచ్చిన వాళ్ళు అందరూ ఎలా ఉన్నారో నారాయణ మూర్తి ఎలా ఉన్నారో నాకు తెలుసు. ఆర్ నారాయణ మూర్తి మంచి హ్యూమన్ బీయింగ్. మల్లెపువ్వు కాదు రోజా పువ్వు కాదు ఆయన ఒక గడ్డి పువ్వు..విద్య బ్యాక్ డ్రాప్ లో యూనివర్సిటీ సినిమా తీశారు. అప్పటి లోఉన్న చదువు ఇప్పుడు లేదు.అప్పుడున్న గౌరవం ఇప్పుడు లేదు. ఇప్పటి గురు శిష్యుల సంబంధం ఏ బార్ లోనో ఎక్కడో చూడవచ్చు. ఇపుడు చదువు కొనే రోజులొచ్చాయి. కొన్ని యూనివర్సిటీలు విద్యను వ్యాపారంగా మార్చేసాయి. ఎడ్యుకేషన్ మాఫియా కధాంసాంతో నారాయణ మూర్తి తీశారు. ప్రేక్షకు లకు నా అభిమానులకీ చెప్పేది ఏమిటంటే ఆర్ నారాయణ మూర్తి తీసిన యూనివర్సిటీ సినిమా అందరూ తప్ప కుండా చూడండి.విద్య వ్యవస్థ లోపాలు తెలుసుకోవాలి అంటే ఈ సినిమా చూడండి అని అన్నారు.

# ఉర్రూతలూగిస్తున్న ‘రుద్రంగి’ ‘జాజిమొగులాలి’



బాహుబలి, ఆర్. ఆర్.ఆర్ చిత్రాలకు రైటర్ గా పని చేసిన అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహిస్తున్న ‘రుద్రంగి’ సినిమాలోని ముఖ్య పాత్రలను రివీల్ చేసి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేసిన ఈ టీం తాజాగా ఫోక్ సాంగ్ రిలీజ్ చేసారు. ‘జాజిమొగులాలి’ అంటూ సాగే ఈ పాటని మోహన భోగరాజు పాడగా బిగ్ బాస్ ఫేమ్ దివి వాద్య ఇందులో స్పెషల్ ఎట్రాక్షన్. ఒకవైపు తన అందాలతో అలరిస్తూనే ఫోక్ సాంగ్ బీట్ కి భాను మాస్టర్ కోరియోగ్రఫీ లో అద్భుతంగా డాన్స్ చేసింది దివి. పూర్తి తెలంగాణ యాసలో సాగే ఈ జానపద పాటకి క్యాచి లిరిక్స్ అభినయ శ్రీనివాస్ అందించగా సంగీతం నాఫల్ రాజా ఏఐఎస్ అందించారు.

ఈ చిత్రాన్ని భారీ నిర్మాణ హంగులతో ఎమ్మెల్యే, కవి, గాయకుడు, రాజకీయ వేత్త శ్రీ రసమయి బాలకిషన్, రసమయి ఫిలిమ్స్ బ్యానర్ పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా జగపతి బాబు, ఆశిష్ గాంధీ, గానవి లక్ష్మణ్, విమలా రామన్, మమతా మోహందాస్, కాలకేయ ప్రభాకర్, ఆర్ఎస్ నంద తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

# రైటర్ పద్మభూషణ్’ చిత్ర యూనిట్ ని అభినందించిన సూపర్ స్టార్ మహేష్ బాబు



రైటర్ పద్మభూషణ్’ చిత్రాన్ని వీక్షించిన సూపర్‌స్టార్ మహేష్‌బాబు తాను కంప్లీట్ గా ఎంజాయ్ చేశానని చెప్పారు. ఈ చిత్రం కథానాయకుడు సుహాస్, దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్, నిర్మాతలు శరత్‌చంద్ర, అనురాగ్‌రెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. మహేష్ బాబు మాట్లాడుతూ, “ఎరైటర్ పద్మభూషణ్ చూసి చాలా ఎంజాయ్ చేశాను. హార్ట్ వార్మింగ్ ఫిల్మ్. ముఖ్యంగా క్లైమాక్స్! ఫ్యామిలీస్ తప్పనిసరిగా చూడవలసిన సినిమా ఇది. సినిమాలో సుహాస్ నటన నచ్చింది. ఘనవిజయం సాధించినం శరత్, అనురాగ్ రెడ్డి, షణ్ముఖ ప్రశాంత్ ఉ టీమ్ అందరికీ అభినందనలు” తెలిపారు. అలాగే సుహాస్, దర్శకుడు, నిర్మాతలతో కలిసి ఉన్న ఫోటోని షేర్ చేశారు మహేష్ బాబు. స్క్రీనింగ్ పూర్తయిన తర్వాత క్లిక్ చేసిన ఫోటో ఇది.‘రైటర్ పద్మభూషణ్’ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు చేస్తూ అందరి ప్రశంసలు పొందుతోంది.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950